డీపీవోగా శాంతామణి

రాజమహేంద్రవరం రూరల్ జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామ పంచాయతీ అధికారి(డీపీవో)గా వి శాంతామణి నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి.గతంలో కొవ్వూరు డివిజనల్ డవలప్‌మెంట్ అధికారిగా పనిచేశారు. పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది.జిల్లాలో ఎమ్మెల్సీ కోడ్ ఉన్న కారణంగా ఉత్తర్వులపై సందిగ్ధత నెలకొంది.

నేడే పింఛన్ల పంపిణీ

2.36 లక్షల మందికి రూ.102.14 కోట్లు అందజేత



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పింఛన్లు పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో శనివారం 9041 క్లస్టర్ ఏరియాల్లో 5158 మంది పీడీవోల ద్వారా పింఛన్లు పంపిణీ చేయిస్తామన్నారు. జిల్లాలో 2 లక్షల 36 వేల 331 మందికి ఎన్‌టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు నేపథ్యంలో క్షేత్రస్థాయి అధికారులు,పెన్షన్ పంపిణీ చేసే సిబ్బందికి తగిన సూచనలు చేశామన్నారు.ఉదయం 6 గంటల నుంచే పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. జిల్లాలో 2,36,331 మందికి 17 కేటగిరీల్లో రూ.102 కోట్ల 14 లక్షల 40 వేలు లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు.జిల్లాలో 11 బ్యాంకులకి చెందిన 71 బ్రాంచీల నుంచి నగదు ఉపసంహరణ ప్రక్రియ పూర్తిచేశామన్నారు.

ఎలుకల మందు ఉచితం

రైతులు సామూహికంగా చేపడితేనే ఎలుకల నిర్మూలన

నిడదవోలు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రైతులంతా సామూహిక ఎలుకల నివారణ చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు అన్నారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెం రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం ఎలుకల నివారణ మందును ఉచితంగా పంపిణీ చేసి మాట్లాడారు. ఎలుకల నివారణకు ప్రభుత్వం తెల్ల రంగు బ్రోమోడయోలిన్ మందును ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తుందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు.రైతులు ఈ మం దును ఎలుకలు బొరియల్లో పెట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏవో జి.సత్యనారాయణ, వ్యవసాయ సహాయకులు మాధవన్,శివనాగు పాల్గొన్నారు.



కేన్సర్ స్ర్కీనింగ్ మెషీన్ అందజేత

రామకృష్ణమిషన్ వైద్యశాలకు ఇచ్చిన రొటేరియన్లు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం గోదావరి గట్టున ఉన్న రామకృష్ణ మిషన్ ధర్మవైద్యశాలకు రూ.8 లక్షలు విలువైన కేన్సర్ స్ర్కీనింగ్ మెషీన్‌ను అందజేసినట్టు రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ అధ్యక్షుడు నాళం నరసింహరావు తెలిపారు. రామకృష్ణ మిషన్ వైద్యశాల ఇన్‌ఛార్జి స్వామి రఘువీరనందజీ మహరాజ్, డాక్టర్ ఇన్నమని రామచంద్రరావులకు మెషీన్‌ను అప్పగించారు.తమిళనాడు రోటరీ డిస్ట్రిక్టు 2982 వారికి వచ్చిన సీఎస్ఆర్ నిధులతో ఈ కేన్సర్ స్ర్కీనింగ్ మిషన్‌ను సమకూర్చారని, రోటరీ డిస్ట్రిక్టు 3020 ద్వారా అందజేయడం జరిగిందన్నారు.కార్యక్రమంలో రొటేరియన్లు గాదె కిషోర్, సుంకర నాగేంద్ర కిషోర్, ఎస్‌జీ శ్యామ్‌సింగ్, అనూప్ జైన్, బలభద్ర మోహన్,శకుంతల పాల్గొన్నారు.



కేన్సర్ స్ర్కీనింగ్ మిషన్ అందజేస్తున్న దాతలు

ఎమ్మెల్సీ ఎన్నికలకు నోడల్ అధికారుల నియామకం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు నోడల్ అధికారులను నియమిస్తున్నట్టు జేసీ ఎస్.చిన్నరాముడు తెలిపారు.ఈ మేరకు తన చాంబర్‌లో శుక్రవారం నోడల్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఈనెల 3న నోటిఫికేషన్ విడుదల చేసి నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. 10వ తేదీతో నామినేషన్ల ముగింపు, 11న నామినేషన్ల పరిశీలన, 13న అభ్యర్థుల ఉపసంహరణ, 27న ఉదయం 8నుంచి సాయంత్రం 4 గంటలకు పోలింగ్ , మార్చి 3న కౌంటింగ్ ఉంటుందన్నారు. మార్చి 8వ తేదీన ఎన్నికల కోడ్ ముగుస్తుందన్నారు.ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా నోడల్ అధికారులు విధులు నిర్వహించాలన్నారు. నోడల్ అధికారుల వివరాలు వెల్లడించారు.

నేడో రేపో రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ల బదిలీ

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే కౌన్సెలింగ్ పూర్తి కావడంతో నేడో, రేపో ట్రాన్స్‌ఫర్ ఉత్తర్వులు రావొచ్చని భావిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రైతుబజార్లు రాజమహేంద్రవరం సిటీలోనే ఏడు ఉన్నాయి.వీటితో పాటు శాటిలైట్ సిటీ, కొవ్వూరులో ఒక్కో రైతుబజార్ ఉన్నాయి. రైతుబజార్లలో పనిచేస్తున్న ఎస్టేట్ ఆఫీసర్లు అంతా రెండేళ్లకు పైనే ఆయా ప్రదేశాల్లో పనిచేస్తున్నారు. దీంతో ఎస్టేట్ ఆఫీసర్లను బదిలి చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. సంక్రాంతి పండగ ముందే కౌన్సెలింగ్ కూడా పూర్తి చేశారు. ఎస్టేట్ ఆఫీసర్లతో పాటు రైతు బజార్లలోని సెక్యూరిటీ సిబ్బందిని బదిలీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ బదిలీలన్నీ అంతర్గతంగానే జరుగుతున్నాయి. దాదాపుగా రాజమహేంద్రవరం సిటీలోనే ఒక బజారు నుంచి మరో బజారుకు మాత్రమే మారుస్తున్నారు.జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలో కౌన్సిలింగ్ ప్రక్రియ అంతా పూర్తి కావడంతో పాటు జిల్లా మార్కెటింగ్ అధికారి ద్వారా ఫైలు సం బంధిత పై అధికారులకు పంపడంతో ఒకటి, రెండు రోజుల్లోనే బదిలీ ఉత్తర్వులు రావొచ్చని భావిస్తున్నారు.బదిలీల కౌన్సెలింగ్ పూర్తి కావడంతో ఎస్టేట్ ఆఫీసర్లు ఉత్తర్వులకు ఎదురుచూస్తున్నారు.

నేటి నుంచి ఇంటర్ పబ్లిక్ అర్హత పరీక్షలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి):ఇంటర్మీడియెట్ 2025 పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులంతా ఈ నెల 1,3 తేదీల్లో జరిగే అర్హత పరీక్షలు రాయాలని ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్, ఒకేషనల్ విద్యార్థులంతా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నైతికత మానవీయ విలువలు పరీక్ష రాయాలన్నారు.3వ తేదీన పర్యావరణ విద్య పరీక్ష రాయాలన్నారు. జిల్లాలో అన్ని మేనేజ్‌మెంట్ జూనియర్ కళాశాలల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. పరీక్షలకు జనరల్ 20,591 మంది ,ఒకేషనల్ నుంచి 2226 మంది విద్యార్థులు హాజరవుతారని ఆర్ఐవో చెప్పారు.



రిజిస్ట్రేషన్లకు.. క్యూ

- రిజిస్ట్రేషన్ ఆఫీస్‌ల కిటకిట
- రాత్రయినా క్రయవిక్రయాలు
- గురువారం 702..
- శుక్రవారం 600 రిజిస్ట్రేషన్లు
- రెండు రోజుల్లో 1302
- భూముల విలువ పెంపే కారణం

రాజమహేంద్రవరం సిటీ/సీతానగరం/ కొవ్వూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రిజిస్ట్రేషన్లకు క్యూకట్టారు.. జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలన్నీ శుక్రవారం ఉదయం నుంచి కక్షిదారులతో కిటకిటలాడాయి.భూముల విలువ శనివారం నుంచి పెరుగుతుందనే కారణంతో గత వారం రోజులుగా రిజిస్ట్రేషన్లకు డిమాండ్ పెరిగింది. శుక్రవారంతో గడువు ముగియడంతో జిల్లా వ్యాప్తంగా కార్యాలయాల్లో రాత్రి వరకూ రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఒక్కో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 50 నుంచి 70 వరకూ రిజిస్ట్రేషన్లు జరిగినట్టు సమాచారం.

ఒక్కరోజే 600 రిజిస్ట్రేషన్లు

రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ చార్జీలను పెం చుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.ఫిబ్రవరి 1 అంటే నేటి నుంచి నూతన ఫీజు విధానం అమలు కాబోతుంది. దీంతో ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్లకు ఎదురుచూసిన ప్రజలు గత రెండ్రోజులుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద క్యూకట్టారు.జిల్లా వ్యాప్తంగా 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కక్షిదారులతో కిక్కిరి శాయి.ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద రాత్రి పొద్దుపోయే వరకు బారులు తీరారు.జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఒక్కరోజే సుమారు 600 రిజిస్ట్రేషన్లు జరిగాయి. కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు సరాసరి 20 నుంచి 30 రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. భూములు ధరలు పెరుగుతాయని సమాచారం రావడంతో 20 శాతం స్టాంపు డ్యూటీ పెరుగుతుందని క్రయ విక్రయదారులు రిజిస్ట్రేషన్లకు పోటెత్తారు.శుక్రవారం ఒక్కరోజే 92 దరఖాస్తులు వచ్చాయి. కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి లాంచీలరేవు వరకు రిజిస్ట్రేషన్లకు వచ్చిన వారి కార్లతో రహదారి నిండిపోయింది. రిజిస్ట్రేషన్లకు వచ్చినవారు ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు రోడ్డుపైనే నిల్చుండిపోయారు. సర్వర్ స్లోగా ఉండడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తయ్యేసరికి రాత్రి 11 గంటలు అవుతుందని భావిస్తున్నారు.

పెంచిన ఫీజు ఇలా..

ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా భూమి విలువను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు ఉన్నదానిపై 5 నుంచి 20 శాతం లోపు భూమి విలువ పెంచింది. దీంతో రిజిస్ట్రేషన్ విలువ పెరుగుతుంది. ఇప్పటి వరకు ఉన్న రిజిస్ట్రేషన్ చార్జీలపై 1.5 శాతం అదనంగా పెం చారు.శుక్రవారం అర్ధరాత్రి నుంచి పెంచిన చార్జీలు అమలు చేసే అవకాశం ఉంది. స్థిరాస్తుల విలువలను బట్టి కొనుగోలు దస్తావేజులకు అయితే 7.5 శాతం చొప్పున అంటే లక్షకు రూ.7500లు చొప్పున సెటిల్‌మెంట్ దస్తావేజులకు కుటుంబ సభ్యుల రిలేషన్లను బట్టి 2.5 శాతం నుంచి 3.5 శాతం వరకు అంటే లక్షకు రూ.2500 నుంచి రూ.3500 వరకు ఫీజులు చెల్లించాల్సి వస్తుంది. పెరిగిన రేట్లను బట్టి అద నంగా అయ్యే ఖర్చు తగ్గించుకోవడానికి కొనుగోలుదారులు ముందస్తుగా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటారు.దీంతో గత వారం రోజులుగా రిజి స్ట్రేషన్లు పెరిగాయి. జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు క్రయవిక్రయదారులతో సందడిగా మారాయి. కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ కె.సుందరరావు మాట్లాడుతూ భూముల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో గత వారం రోజులుగా రిజిస్ట్రేషన్లకు కక్షిదారులు పోటెత్తారని తెలిపారు. ప్రభుత్వానికి సుమారు రూ.30 లక్షల నుంచి 35 లక్షల ఆదాయం అధికంగా సమకూరుతుందన్నారు.

రెండు రోజుల్లో 1302 రిజిస్ట్రేషన్లు

జిల్లాలో 5 నుంచి 20 శాతం వరకు ఆస్తుల విలువలు పెరిగాయి. సబ్ రిజిస్ట్రారు కార్యాలయ ప్రొటెన్షియాలిటీని బట్టి విలువలు పెంచడం జరిగింది.సీతానగరం మండలంలో 20 శాతం వరకు పెరిగింది.జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో గురువారం 702 రిజి స్ట్రేషన్లు,శుక్రవారం 600 రిజిస్ట్రేషన్లు జరిగాయి.

- రెడ్డి సత్యనారాయణ, జిల్లా రిజిస్ట్రారు



మూడో రోజు పార్కులో పరిశీలిస్తున్న ఎస్ఈ పాండురంగారావు, శానిటేషన్ సిబ్బంది, మాజీ కార్పొరేటర్ చండీప్రియ తదితరులు.. కాలనీలో వెలుగుతున్న లైట్లు

చీకటి పోయింది.. వెలుగొచ్చింది!

వెంకటేశ్వరనగర్‌లో మూడో రోజు పనుల జోరు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అక్షరమే అండగా , సమస్యల పరిష్కారమే అజెండా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సమస్యల పరిష్కారంపై వెంకటేశ్వరనగర్‌లో నిర్వహించిన సభలో అధికారుల్లో కదలిక వచ్చింది. ప్రజల నుంచి ప్రధానంగా తలెత్తిన సమస్యలపై అధికార యంత్రాంగం దృష్టిపెట్టింది.ఈ మేరకు గత మూడు రోజులుగా వరుసగా 9వడివిజన్‌లో ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది, మాజీ కార్పొరేటర్ కోసూరి చండీప్రియ, పార్కు కమిటీ పెద్దలు కలిసి వెంకటేశ్వనగర్‌లో సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తున్నారు. కార్పొరేషన్ ఎస్ఈ ఐ.పాండురంగారావు శుక్రవారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి వెంకటేశ్వనగర్ పార్కును పరిశీలించారు. పార్కులో గతంలో చేపట్టిన పనులపై ఎస్ఈ ఆరా తీయగా సుమారు రూ.65 లక్షల పనులు తెరపైకి వచ్చాయి. అంత మొత్తంతో అభివృద్ధి చేసిన వెంకటేశ్వనగర్ పార్కులేదనే వాదన తెరపైకి వచ్చింది.దీనిపై విచారణకు ఆదేశించే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా పిల్లల కోసం పార్కులో ఏర్పాటు చేసి పరికరాలు, జిమ్ పరికరాలు పాడైపోవడం, టైల్స్ పోవడం తదితర సమస్యలు ఉన్నాయి. పనులకు మరమ్మతులు కాంట్రాక్టరే చేయాల్సి ఉంటుందని పిలిపించి మాట్లాడాలని ఆదేశించారు. పార్కులో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఏది ఏమైనా 9వ డివిజన్‌లో సమస్యలు పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయి.వీధి దీపాలు వేయించారు.



నందరాడ గ్రామంలో ఉన్న 566 ఎకరాల అడుసుమిల్లి వెంకయ్య చెరువు (ఏవీ ట్యాంకు)

ఆక్రమించేయ్!

గ్రామ చెరువులు అన్యాక్రాంతం

- మాయమైపోతున్న చెరువులు
- పెరిగిపోతున్న ఆక్రమణలు
- చెరువులపై కానరాని సర్వే
- నీరుగారుతోన్న దాతల ఆశయం
- అయినా పట్టని అధికారులు
- రాజానగరంలో ఇదీ పరిస్థితి
- జిల్లా వ్యాప్తంగానూ ఇంతే
- కలెక్టర్‌కు వినతులు

ప్రస్తుతం చెరువులు చూస్తుంటే గుండె చెరువైపోతోంది.. ఎందుకంటే ఆక్రమణలు లేని ఒక చెరువైనా ఉందా అంటే అనుమానమే.. గత వైసీపీ ప్రభుత్వం భూస్వాముల భూములు ఎలా ఉన్నాయో సర్వే చేసింది కానీ.. చెరువులు పరిస్థితి ఎలా ఉందో సర్వే చేయలేదు.. చేసుంటే తెలిసేది ఆక్రమణలన్నీ అక్కడే ఉన్నాయని.. గత ప్రభుత్వంలోనే చాలా మందికి ఇళ్ల స్థలాలు కూడా ఇచ్చేశారు.. అయినా నేటికీ చెరువులన్నీ ఆక్రమణల మధ్యనే ఉన్నాయి. రాజానగరం నియోజకవర్గంలోనే పదుల సంఖ్యలో చెరువులు ఉన్నాయి.ఈ చెరువులదీ ఇదే పరిస్థితి.. ఇకనైనా అధికారులు ఆక్రమణలో ఉన్న చెరువులపై దృష్టి సారించాల్సి ఉంది.

రాజానగరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : దాతల ఆశయం నీరుగారిపోతోంది.. కళ్లెదుటే చెరువులు మాయమైపోతున్నాయి.. నిన్నటి వరకూ ఇక్కడ చెరువు ఉండాలే అనేలా ఆక్రమించేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా తాగు, సాగునీటి చెరువులు అన్యాక్రాంతమైపోతున్నాయి. ఒక పక్క అభివృద్ధి ముసుగులో అక్రమ మట్టి తవ్వకాలు, మరోపక్క అక్రమ కట్టడాలతో చెరువులు కుచించుకుపోతున్నాయి. అయినా చెరువులను కబ్జా కోరల నుంచి రక్షించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువుల్లో చేప పిల్లల విడుదలకు సన్నాహాలు చే స్తుంది.. ఈ నేపథ్యంలో చెరువుల విస్తీర్ణంపై సర్వే చేయించి ఆక్రమణల భరతం పట్టాల్సి ఉంది.

చెరువుల ఆక్రమణ..

రాజానగరం మండలం నందరాడ పరి ధిలో అడుసుమిల్లి వెంకయ్యచెరువు (ఏవీ ట్యాంకు) 566 ఎకరాల విస్తీర్ణంలో ఉంది.దీనిలో నరేంద్రపురం పంచాయతీ పరిధిలో సర్వే నెంబరు 110లో 188.74 ఎకరాలు, నందరాడ పరి ధిలో సర్వే నంబరు 376లో 377.31 ఎకరాల్లో ఉన్న ఏవీ ట్యాంకు నేడు స్వరూపం కోల్పోయి బక్కచిక్కిపోయింది. చెరువు గర్భంలో విలువైన భూమిని కొంతమంది సాగు చేసుకుంటుండగా..మరికొందరు విలువైన మట్టిని రాత్రీపగలు తేడా లేకుండా దోచుకుంటున్నారు. దివాన్‌చెరువులోని తాగునీటి చెరువుగా ఉన్న ఊరచెరువును ఉపాధి హామీ పథకంలో లక్ష లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేసినా ఫలితం లేకపోయింది. సర్వే నెంబరు 1.194లో 5.86 ఎకరాలు,195లో 2.00 ఎకరాలు విస్తీర్ణంలో ఊరచెరువు ఉంది. సర్వే నెంబరు 244లో 10 ఎకరాలు కొత్తచెరువు, సర్వే నెంబరు 283లో 9.52 ఎకరాలు కంచిమూర్తులా చెరువు, సర్వే నెంబరు 315లో 15.22 ఎకరాలు కోలమూరు చెరువు, సర్వే నెంబరు 52లో 8.18 ఎకరాలు పెద్ద చెరువు, సర్వే నెంబరు 53లో 20.24 ఎకరాలు, సర్వే నెంబరు 73లో 3.21 ఎకరాలు యంద్రావారి చెరువులు రికార్డుల్లో నేటికి కూడా నమోదై ఉన్నప్పటికి సహజ సిద్ధం ఆక్రమణల చెరులో కొట్టుమిట్టాడుతున్నాయి. రాజానగరం మండలం ముక్కినాడ పంచాయతీ పరిధిలో ఆక్ర మణకు గురైన చెరువులను పరిరక్షించాలని కోరుతూ జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీరామ్ ఇటీవల రెవెన్యూ సదస్సుల్లో రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఇటీవల రాజా నగరం లో కలెక్టర్ పి.ప్రశాంతి నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో నందరాడ చెరువును ఆక్రమణల నుంచి కాపాడాలని రైతాంగం విన్నవించుకున్నారు.

నియోజకవర్గమంతా ఇంతే..

నియోజకవర్గంలో రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల్లో వందలాది ఎకరాల విస్తీర్ణంలో తాగు,సాగునీటి చెరువులు ఉన్నాయి. చెరువుల అభివృద్ధి ముసుగులో గత వైసీపీ ప్రభుత్వంలో విలువైన మట్టిని జగనన్న కాలనీలు చదును పేరుతో వైసీపీ నాయకులు అక్రమంగా తవ్వి జేబులు నింపుకున్నారు. కొన్ని చెరువులను ఆక్రమించేశారు.తాగునీటి అవసరాలకు వినియోగించే చెరువు గట్టుపై ఇప్పటికే ఎవరికి వారు ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేసి పక్కా భవన నిర్మాణాలు చేపట్టారు.చెరువుల ఆక్ర మణలకు సంబంధించి సదరు గ్రామస్థులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించు కోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో పంచాయతీ అధికారులు రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఆక్రమిత స్థలాల్లో నిర్మాణాలు పుట్టు కొస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు సాగు, తాగునీటి చెరువులపై దృష్టి సారించి,చెరువు భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ముంచేస్తుందమ్మా.. కలెక్టరమ్మా

అడుసుమిల్లి వెంకయ్యచెరువు (ఏవీ ట్యాంకు) ఆయకట్టు పరిధిలో నందరాడ, కలవచర్ల గ్రామాలకు సంబంధించి సుమారు 1200 ఎకరాలు సాగులో ఉంటుంది. అధిక వర్షాలు,వరదల సమయంలో ఏవీ ట్యాంకులో అవసరమైనప్పుడు వాడుకునేందుకు నీటి నిల్వకు చెరువు కళింగలకు బల్లలతో అడ్డుకట్ట వేయడం పరిపాటి. దీంతో ఎగువ భాగం నరేంద్రపురం పరిధిలోని రైతుల వరి పొలాలు ముంపునకు గురవుతుంటాయి. ఈ విధంగా ప్రతిసారి దాదాపు 100 నుంచి 130 ఎకరాల్లోని వరి పంట ముంపుబారిన పడుతోంది. తమ పంట పొలాలను ముంపు బారి నుంచి కాపాడాలని అనేకమార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోవడంతో ఇటీవల రాజానగరంలో కలెక్టర్ పి.ప్రశాంతి నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో నరేంద్రపురం రైతాంగం విన్నవించుకున్నారు. తమ రెవెన్యూ పరిధిలో ఏవీ ట్యాంకులో 188 ఎకరాలు ఉన్నప్పటికి ఆదాయం మాత్రం ఫిషర్‌మెన్ సొసైటీ పేరుతో నందరాడకు కట్టబెడుతున్నారని కలెక్టర్‌కు వివరించారు.దీని వల్ల తమ గ్రామానికి ఆదాయం రాకపోగా.. పంట పొలాలు ముంపునకు గురై అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వాపోయారు. ఇప్పటి కైనా అధికారులు దృష్టి సారించి అధిక వర్షాల సమయంలో చెరువు కళింగలకు అడ్డుకట్ట వేయకుండా.. చేపల ద్వారా వచ్చే ఆదాయం తమ పంచాయతీకి వర్తించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రశాంతికి విజ్ఞప్తి చేశారు.



ర్యాంపు వద్ద మాట్లాడుతున్న జేసీ

ఆరు వేబ్రిడ్జిల నిర్మాణం : జేసీ

కొవ్వూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు డివిజన్ పరిధిలో ఇసుక రీచ్‌ల వద్ద ఏర్పాటు చేయనున్న ఆరు వేబ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జేసీ చిన్నరాముడు ఆదేశించారు.ఇసుక ర్యాంపులను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. ఇసుక ర్యాంపుల నుంచి పరిమితికి లోబడి లోడింగ్ చేయాలన్నారు. ఇసుక ర్యాంపులలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది జవాబుదారీతనంగా ఉండాలన్నారు. ఆర్డీవో డా.రాణి సుస్మిత మాట్లాడుతూ కొవ్వూరు పట్టణంలో ఎరినమ్మ, ఔరంగాబాద్ 1,2, వాడపల్లి, దండకుంట ఇసుకరీచ్‌ల వద్ద వే బ్రిడ్జి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. త్వరితగతిన వేబ్రిడ్జిల నిర్మాణ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ ఉన్నారు.

కడియపులంక ఎన్నికలకు హైకోర్టు ఉత్తర్వులు

కడియం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కడియం మండలం కడియపులంక పంచాయతీకి ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఈనెల 24న ఉత్తర్వులు విడుదల చేసినట్టు సమాచారం.2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కడియపులంక సర్పంచ్ స్థానం బీసీ-మహిళకు కేటాయించారు.ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన మార్గాని అమ్మాణీ సర్పంచ్‌గా విజయం సాధించారు.అయితే పదవిలో ఉండగానే అమ్మాణీ 2023 మే 21న చనిపోయారు. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారులు ఉపసర్పంచ్‌గా ఉన్న పాటంశెట్టి వెంకటరామారావుకు ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై సంతృప్తి చెందని దివంగత సర్పంచ్ అమ్మాణీ భర్త ఏడుకొండలు, పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.దీంతో నాలుగు నెలల్లోపు ఎన్నికలు జరపాలంటూ హైకోర్టు ఉత్తర్వులు విడుదల చేసినట్టు తెలిసింది.

ఎస్ఐ మృతి

ఘటనపై భిన్న వాదనలు 7

డిజిటల్ అరెస్టు - మెయిన్‌లో..

రూ.52 లక్షల దోపిడీ



వాడపల్లిలో డ్రాగన్ ఫ్రూట్



» ఇసుక, మట్టి నేలల్లోనూ సాగు » లాభాలు ఆర్జిస్తున్న రైతులు

ఆత్రేయపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చైనాలో పండే డ్రాగన్ ఫ్రూట్స్ పచ్చని కోనసీమలో రైతులకు కాసుల పంట పండిస్తోంది. ఉభయ గోదావరి జిల్లాల్లో రైతులు ఈ పంటను సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. గత కొన్నేళ్లుగా డ్రాగన్ ఫ్రూట్‌ను ప్రజలు బాగా వినియోగిస్తున్నారు. ఇది ఆరోగ్యప్రదాయిని కావడంతో ఎంత ధరైనా పెట్టి కొనుక్కుని ఎంతో ఇష్టంగా తింటున్నారు. ప్రస్తుతం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని ఇసుక, మట్టి నేలల్లో ఈ పంట బాగా పండడంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 28వేల ఎకరాల్లో రైతులు ఉద్యానవన పంటలు సాగు చేస్తున్నారు. వాడపల్లికి చెందిన యేపుగంటి సతీష్ 1.50 సెంట్లలో ప్రయోగాత్మకంగా డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తూ అధిక లాభాలు ఆర్జిస్తున్నాడు. ఉద్యానవన పంటలకు ప్రకృతి విపత్తులతో నష్టాలు ఎదురవుతున్నాయి. అయితే డ్రాగన్ ఫ్రూట్ పంటకు విపత్తుల నుంచి ఎటువంటి ప్రమాదం లేకపోవడంతో మిగిలిన రైతులు కూడా ఈ పంటను పండించేందుకు సమయాత్తమవుతున్నారు. ఎకరాకు రూ.8 లక్షలు ఖర్చు అవుతుంది. ఏడాదిన్నరలోగా పంట చేతికొస్తుంది. సుమారు ఆరేళ్ల పాటు ఫ్రూట్స్ కాస్తాయి. రైతులు తోటలో కిలో రూ.120 నుంచి రూ.150 వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. వేసవిలో డ్రాగన్ ఫ్రూట్ పంటకు ఉష్ణోగ్రత చల్లగా ఉండాలి. పంట తడిసేలా డ్రిప్ సౌకర్యం కల్పించాలి. డ్రిప్ ఇరిగేషన్‌కు రాయితీలను అందిస్తున్నారు.



దిగుబడి అధికం

యేపుగంటి సతీష్, రైతు, వాడపల్లి

ఎకరన్నర పొలంలో డ్రాగన్ ఫ్రూట్ పండించాం. రూ.8 లక్షల వరకు పెట్టుబడి పెట్టాం. పంట దిగుబడి ఆశాజనకంగానే ఉంది. ఆదాయం కూడా బాగుంది. మరింత మంది రైతులు ఈ పంట సాగుకు ముందుకు వస్తున్నారు.



వాడపల్లి తోటలో రైతులు పండించిన డ్రాగన్ ఫ్రూట్స్

డ్రిప్, పైపులకు 90 శాతం రాయితీ

జి.కోటేశ్వరరావు, ఉద్యానవన శాఖాధికారి, కొత్తపేట



డ్రాగన్ ఫ్రూట్ పంట ఎండ వేడి నుంచి తట్టుకునేందుకు ఉష్ణోగ్రత చల్లగా ఉండాలి. ఈ సాగు చేపట్టే రైతులకు డ్రిప్, పైపు, స్తంభాలకు ప్రభుత్వం 90 శాతం రాయితీ అంటే సుమారు రూ.3లక్షలు అందిస్తుంది. దీంతో సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.



ఈవో సుబ్బారావుకు విరాళం అందజేస్తున్న దాత నరేష్‌బాబు

హరిహరసదన్ కాటేజీకి రూ.5 లక్షలు విరాళం

అన్నవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్యగిరి కొండపై నిర్మితమైన హరిహర సదన్ కాటేజీకి శుక్రవారం సికింద్రాబాద్‌కు చెందిన చేకొండ నరేష్‌బాబు, విజయ, కుటుంబసభ్యులు రూ.5 లక్షలు విరాళాన్ని ఈవో సుబ్బారావుకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులను ఈవో అభినందించి స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించి, ప్రసాదాలు అందజేశారు. సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన సీహెచ్.విఘ్నేశ్వరరావు రూ.1.80 లక్షలు విరాళం అందజేశారు.




హోమ పూర్ణాహుతిలో పాల్గొన్న ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్

వనదుర్గ ఆలయంలో ఘనంగా చండీ హోమం

అన్నవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీ హోమం ఘనంగా జరిగింది. ఉదయం 9 గంటలకు పండితులు గణపతి పూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణ, మూలమంత్ర జపాలు పఠించారు. పదకొండు గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను మంత్రపూర్వకంగా అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ప్రస్తుతం ఏలూరు జిల్లాలో ఉన్న కుక్కునూరు సమీపంలో నాడు గోదావరిపై జలమార్గ సాధ్యాసాధ్యాలపై సర్వే చేస్తున్న దృశ్యం (పాత చిత్రం)



సర్వేతోనే సరి

గో...దారేదీ!

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

జాతీయ జలమార్గం సర్వేతోనే సరిపెట్టుకుంది. సరిగ్గా పన్నెండేళ్ల క్రితం పడ్డ అడుగులు అక్కడే ఆగిపోయాయి. ఆ మేరకు చేపట్టిన సర్వే వ్యయం రూ.కోటి వృథా అయ్యింది. గోదావరిపై జల మార్గానికి 2013లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రోడ్డు మార్గానికి ప్రత్యామ్నాయంగా జలమార్గ వినియోగం లాభదాయకమని భావించింది. ప్రధానంగా సరుకు రవాణా సులభతరమవడం, వ్యయ భారం తగ్గడం, రోడ్లపై ట్రాఫిక్ రద్దీ నియంత్రణ కూడా సాధ్యమేనన్న ఆలోచనే ఈ నిర్ణయానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు రాజమహేంద్రవరం నుంచి భద్రాచలం వయా వెలేరుపాడు, కుక్కునూరు, వరరామచంద్రపురం మధ్య ఉన్న 171 కి.మీ., భద్రాచలం నుంచి నాసిక్ వరకు ఉన్న 1,184 కి.మీ. నదీ జలాలపై సర్వే కూడా పూర్తయింది. అదే దశలో గోదావరి ఏలూరు కెనాల్ (రాజమహేంద్రవరం నుంచి ఏలూరు) 74 కి.మీ., కృష్ణా ఏలూరు కెనాల్ (ఏలూరు నుంచి విజయవాడ వరకు) 65 కి.మీ., మేర జల రవాణాను సుగమం చేయాలని నాడు భావించారు. సర్వే తంతుని ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించడం... ఆపై కేవలం నెలలోనే సర్వే పూర్తిచేయడం చకచకా జరిగిపోయింది. సర్వేలో గోదావరి లోతు, అడుగు భాగంలో ఉన్న ఇసుక, పెద్ద రాళ్ల గుర్తింపుతో పాటు గోదావరి ప్రవాహ వేగంపై అధ్యయనం జరిగింది. ఆ మేరకు ఆధునిక పరిజ్ఞానమైన జీపీఎస్, హైడ్రోలాజికల్, టోపోగ్రాఫికల్ పద్ధతులు వినియోగించిన సంస్థ రాజమహేంద్రవరం నుంచి నాసిక్ వరకు జల మార్గం సాధ్యమేనని తేల్చిచెప్పింది. వాస్తవానికి భద్రాచలం, చింతూరు డివిజన్ల నుంచి

రూ.కోటి వ్యయం వృథా

రాజమహేంద్రవరానికి జలమార్గం కొత్తేమీ కాదు. ఐదున్నర దశాబ్దాల క్రితం భద్రాచలం, చింతూరు ఏజెన్సీ దట్టమైన అడవులతో వెనుకబడిన ప్రాంతాలుగా ఉండేవి. నాడు రాజమహేంద్రవరం నుంచే కుక్కునూరు, వెలేరుపాడు, కూనవరం, వరరామచంద్రపురం, చింతూరు మండలాలతో పాటు తెలంగాణ రాష్ట్రం భద్రాచలం డివిజన్లోని దుమ్ముగూడెం, వెంకటాపురం మండలాలకు నిత్యావసర వస్తువులతో పాటు వ్యవసాయ పరికరాలు, ఎరువులు, డీజిలు తదితర సామగ్రి లాంచీల ద్వారానే దిగుమతి అయ్యేవి. తర్వాత ఇక్కడ పండించిన పంటలను రాజమహేంద్రవరానికి లాంచీల ద్వారానే ఎగుమతి చేసేవారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి కలప, వెదురులను గోదావరి మీదుగానే రాజమహేంద్రవరం చేర్చేవారు. దీంతో నిత్యం లాంచీల రాకపోకలు సాగేవి. నాటి కాలంలో భద్రాచలం నుంచి రాజమహేంద్రవరం లాంచీపై ప్రయాణం చేయడానికి ఒక్కో వ్యక్తికి రూ.3 నుంచి రూ.5 టికెట్ ఉండేది. కాగా ఈ జలమార్గం సర్వేతోనే సరిపెట్టుకోవడంతో ముందుకు సాగకుండా పోయింది.

అర్ధరాత్రి ఒంటి గంట నుంచే వ్రతాలు

- వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్ వ్యవస్థ
- ఎక్కడికక్కడ హోల్డింగ్ పాయింట్లు
- అన్నవరంలో భీష్మ ఏకాదశి, మాఘపౌర్ణమి ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం



సమీక్షలో పాల్గొన్న అన్నవరం దేవస్థానం ఈవో, చైర్మన్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది

అన్నవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8వ తేదీన భీష్మ ఏకాదశి, 12వ తేదీ మాఘ పౌర్ణమి సందర్భంగా సత్యదేవుని సన్నిధికి విచ్చేసే భక్తుల సౌకర్యాల కల్పనపై శుక్రవారం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా భీష్మ ఏకాదశి పర్వదినాన సుమారు 80వేల మంది భక్తులు విచ్చేస్తారని, 12 నుంచి 15 వేలు వ్రతాలు జరుగుతాయని అంచనా వేస్తూ దానికణుగుణంగా ఏర్పాట్లపై దృష్టిసారించారు. అర్ధరాత్రి 12 గంటలకు వ్రతం టిక్కెట్లు విక్రయించి ఒంటి గంట నుంచి వ్రతాలు, రెండు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించాలని నిర్ణయించారు. కార్తీకమాసంలో రద్దీకి తగినట్టు చేసిన ఏర్పాట్ల కంటే మిన్నగా సౌకర్యాల కల్పనపై దృష్టిసారించాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్ వ్యవస్థ ఉండేలా చూడాలని ట్రాఫిక్‌ను సత్యగిరి కొండపైకి మళ్లించి ఉచిత వాహనాల ద్వారా భక్తులను రత్నగిరికి చేర్చాలని నిర్ణయించారు. ఎక్కడా తొక్కిసలాటలు జరగకుండా క్యూలైన్లు పటిష్టపరిచి, ఎక్కడికక్కడ హోల్డింగ్ పాయింట్లను ఏర్పాటుచేసి రద్దీ ఆధారంగా క్యూలైన్ల ద్వారా భక్తులను వ్రతాలు, దర్శనాలకు అనుమతించాలని నిర్ణయించారు. సిబ్బంది అంతా సమన్వయంతో ముందుకెళ్లాలని ఈవో సూచించారు. భక్తులకు ఉచిత పులిహోర, దద్దోజన ప్రసాదాన్ని ఉదయం 8గంటల నుంచి ప్రారంభించాలని ఆదేశించారు. ప్రోటోకాల్ వ్యక్తుల దర్శనాలు, సామాన్య భక్తుల దర్శనాలు ఎవ్వరికీ ఇబ్బంది కలగకుండా అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు సీఐ సూరిఅప్పారావు, ఎస్‌ఐ హరిబాబు, సర్పంచ్ కుమార్‌రాజా, దేవస్థానం ఏఈవోలు కొండలరావు, కృష్ణారావు, జగ్గారావు, సూపరెంటెండెంట్‌లు బలువు సత్యశ్రీనివాస్, అనకాపల్లి ప్రసాద్, ఐవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో శిశు ఆధార్ సేవలు

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో శిశు ఆధార్ సేవలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గైనిక్ విభాగంలోని బర్త్ రిజిస్ట్రేషన్ వార్డులో ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. సివిల్ సర్జన్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డా.ఎస్.రాజకుమారి రిజిస్ట్రార్‌గా వ్యవహరించనున్నారు. జీజీహెచ్ మెడికల్ రికార్డు విభాగం సెక్షన్ ఆధ్వర్యంలో ఈ సేవలు అందనున్నాయి. శిశువు పుట్టిన వెంటనే ఆధార్ కార్డు మంజూరు చేయడం ఈ పథకం లక్ష్యం. ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డా.శ్రీనివాసన్, అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ కలెక్టర్ ఎస్.శ్రీధర్, గైనిక్ హెచ్‌వోడి డా.అనురాగమయి, ఎంఆర్‌డీ, ఎంఆర్‌వో జయచంద్ర పాల్గొన్నారు.

పీఏడీఏ పీడీగా శ్రీధర్

డిప్యూటీ కలెక్టర్, కాకినాడ జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.శ్రీధర్‌ను పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పీఏడీఏ) పీడీగా నియమిస్తూ కలెక్టర్ షాన్‌మోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాలతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఆరుగురు అధికారులను కలెక్టర్ ఈ విధానంలో నియమించారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు

108 రకాల పిండి వంటలతో నైవేద్యం



అమ్మవారికి నివేదించిన 108 రకాల వంటలు

అన్నవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవమైన వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం గ్రామంలో వాసవీమాత ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి 108 రకాల పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ విచ్చేసి పూజల్లో పాల్గొన్నారు. ముందుగా ఉదయం 10గంటలకు గ్రామంలో వైశ్యులు వ్యాపార సముదాయాలను మూసివేసి అమ్మవారిని పల్లకీలో ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించి జై వాసవీ నినాదాలతో హోరెత్తించారు. వాసవీక్లబ్, వనితాక్లబ్, ఆర్య వైశ్య సంక్షేమసమాజం ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధికసంఖ్యలో గ్రామస్థులు అమ్మవారిని దర్శించారు. ఎమ్మెల్యే సత్యప్రభ వాసవీమాత గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో వాసవీ, వనిత క్లబ్ నాయకులు దాసరి గౌతమి, అమరా వీరలక్ష్మి, దాసరి రజనీ, పులవర్తి నవీన్, దాసరి కుమార్, విహారి, సంఘనాయకులు దాసరి ప్రసాద్, శంకర్, గణపతి, జొన్నాడ రాజేష్, బోనగిరి శ్రీనివాస్, కడిమిశెట్టి సతీష్ ఉన్నారు.



ఎమ్మెల్యే సత్యప్రభకు స్వాగతం పలుకుతున్న మహిళలు

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో రజత పతకం



రజత పతకంతో నరాల లక్ష్మీ

కాకినాడ రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెనికి చెందిన నరాల లక్ష్మీ అనే క్రీడాకారిణి హైదరాబాద్ యూసఫ్ గుడా కోట్ల విజయభాస్కరరెడ్డి స్టేడియంలో జరిగిన 40వ జాతీయ స్థాయి క్యోర్ యుగి, 13వ జాతీయ సీనియర్ పూమ్సే తైక్వాండో చాంపియన్‌షిప్ 2024-25 పోటీల్లో ప్రతిభ కనబరచి రజత పతకం సాధించింది. బీసీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న లక్ష్మీ ఈనెల 28 నుంచి 30 వరకూ జరిగిన తైక్వాండో సీనియర్ క్యోర్‌యుగి, పూమ్సే కేటగిరిలో ఈ పతకాన్ని గెలుపొందగా.. గతంలో రాష్ట్ర జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో రాణించి ప్రథమస్థానంలో నిలిచి స్వర్ణ పతకాలు పొందింది. తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో ఈ పోటీలు జరిగాయి. సీనియర్ ఉమెన్ అండర్ 73 కిలోల విభాగంలో ఈ ఘనత సాధించింది. సిల్వర్ పతకాన్ని సాధించిన లక్ష్మీని గ్రామంలోని వివిధ రాజకీయపార్టీల నాయకులు, పెద్దలు అభినందించారు. లక్ష్మీ మాట్లాడుతూ తైక్వాండో మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచుతుందని, ప్రతీ ఒక్కరూ ప్రోత్సహించాలని కోరింది.

నేడు దంటు కళాక్షేత్రంలో భూతకాలం నాటకం

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 31(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని దంటు కళాక్షేత్రంలో గోవాడ క్రియేషన్స్ అసోసియేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం భూతకాలం నాటకం ప్రదర్శిస్తామని దంటు కళాక్షేత్రం అధ్యక్షులు దంటు భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దంటు కళాక్షేత్రం గౌరవ సలహాదారుడిగా పనిచేస్తూ ఇటీవల మరణించిన డీవీఎన్ శర్మ, ప్రముఖ సంగీత దర్శకులు జి.సర్వేశ్వరరావుకు నివాళులర్పిస్తూ ఈ నాటకం ప్రదర్శిస్తామన్నారు. తొలుత డీవీఎన్ శర్మ సంతాప సభ జరుగుతుందని తెలిపారు.

జాతీయస్థాయి హాకీ టోర్నమెంట్

విజయవంతానికి ప్రత్యేక కమిటీలు

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 15 నుంచి 28 వరకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అంశాలవారీగా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశామని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో హాకీ టోర్నమెంట్ నిర్వహణ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగే ప్రతిష్టాత్మకమైన టోర్నమెంట్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆయా అంశాలవారీగా వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. దీనిలో భాగంగా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, జాయింట్ కలెక్టర్, డీఆర్వో, సీపీవో, డీఎస్డీవోలు సభ్యులుగా ఏర్పాటు చేసిన ఆర్గనైజింగ్ కమిటీ, వివిధ ఉప కమిటీల సహకారంతో టోర్నమెంట్ నిర్వహణ అన్ని అంశాలపై పర్యవేక్షిస్తుందన్నారు. డీటీసీ నేతృత్వంలో ట్రాన్స్‌పోర్టు, రిసెప్షన్ కమిటీ క్రీడాకారులకు స్వాగతం, రవాణా, బస సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు.డీడీ-గ్రౌండ్ వాటర్ నేతృత్వంలో రిజిస్ట్రేషన్ కమిటీ పాల్గొనేందుకు వచ్చిన టీముల రిజిస్ట్రేషన్ కమిటీ పాల్గొనేందుకు వచ్చిన టీముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించి వారికి అవసరమైన ఏర్పాట్ల కోసం మిగిలిన సబ్ కమిటీలకు సూచించాలన్నారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డియం నేతృత్వంలో ఫుడ్ కమిటీ క్రీడాకారులకు ఆహార ఏర్పాట్లను, కాకినాడ ఆర్డీవో నేతృత్వంలోని అకామిడేషన్ కమిటీ క్రీడాకారులకు బస ఏర్పాట్లను, ఏపీసీ సమగ్రశిక్ష నేతృత్వంలో టెక్నికల్ కమిటీ పోటీల నిర్వహణకు సంబంధించిన సాంకేతిక అంశాలను, డీఎంహెచ్‌వో నేతృత్వంలోని మెడికల్ కమిటీ కీడాకారులకు ప్రథమ చికిత్స, అంబులెన్స్ సేవలను నిర్వహించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావన, డీఎస్డీవో శ్రీనివాసకుమార్, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి పాల్గొన్నారు.

8 నుంచి వ్యాయామ ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు

కాకినాడ అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు ఫిబ్రవరి 8 నుంచి 10 వరకు రాష్ట్రస్థాయి సెమినార్, క్రీడా పోటీలు కాకినాడ డీఎస్ఏ మైదానంలో జరుగుతాయని వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఆసక్తిగల ఉపాధ్యాయులు ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు కాకినాడ డీఎస్ఏలో జరిగే ఎంపికల్లో పాల్గొనాలన్నారు. వివిధ క్రీడల్లో మహిళ, పురుష క్రీడాకారులకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తారని రాష్ట్ర సంఘ అధ్యక్షుడు లంకా జార్జి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నూకరాజు, కోశాధికారి జి.రవికొర్ పాల్గొన్నారు.

వాహనాల సామర్థ్య పరీక్ష సెంటర్ ప్రారంభం



వాకలపూడిలో ప్రారంభమైన సెంటర్

సర్పవరం జంక్షన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా వాకలపూడి ఏడీబీ రోడ్డులో కంట్రోల్ ఆల్ట్ పిక్స్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఆటోమేటెడ్ సామర్థ్య పరీక్షల సెంటర్ (ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్)ను ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు చెరుకూరి కిరణ్, పొట్లూరి బుజ్జిబాబు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రోడ్డు ట్రాన్స్‌పోర్టు వాహనాలు పూర్తి ఫిట్‌గా ఉండాలన్న లక్ష్యంతో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ దేశవ్యాప్తంగా ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్‌స్టేషన్లు మంజూరు చేసిందన్నారు. ఇందులో ఏపీలో 22 సెంటర్లు మంజూరు కాగా తమ సంస్థ ఆధ్వర్యంలో అనకాపల్లి, రాజమహేంద్రవరంతో పాటూ వాకలపూడిలో ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్లు ప్రారంభించడం జరిగిందన్నారు. ఒకేసారి 4 వాహనాలకు టెస్టింగ్ సామర్థ్యంతో ఈ సెంటర్ ప్రారంభించామన్నారు. ఒక్కో వాహనానికి 20 నిమిషాల సమయం పడుతుందన్నారు. టెస్టింగ్ అనంతరం ఆన్‌లైన్‌లో జారీ చేసిన సర్టిఫికెట్‌ను యాజమానికి అందివ్వడం జరుగుతుందన్నారు. అన్ని రకాల వాహనాలకు సుమారు 36 రకాల ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహించేందుకు అవసరమైన అనుమతులను కేంద్రం నుంచి పొందడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సలహా మండలి సభ్యులు మేకా లక్ష్మణరావు, ఆదినారాయణ, మీసాలరాజు, పలువురు వాహన యాజమానులు పాల్గొన్నారు.

కరప సొసైటీ ఇన్‌చార్జ్ సీఈవో ఆత్మహత్య

- కాకినాడలోని లాడ్జిలో ఉరేసుకుని బలవన్మరణం
- చేయని తప్పుకు ఇరికించారని మృతుడు నారాయణమూర్తి సూసైడ్ నోట్
- సొసైటీ సొమ్ములు దుర్వినియోగంపై విచారణ
- తిరిగి కట్టాలని అధికారులు ఒత్తిడి చేయడమే మూర్తి చావుకు కారణమా..?



కాకినాడలోని లాడ్జిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ కరప సొసైటీ సీఈవో నక్కా నారాయణమూర్తి

మృతుడు నారాయణమూర్తి(ఫైల్)

కరప, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కరప సొసైటీ ఇన్‌చార్జ్ సీఈవో నక్కా నారాయణమూర్తి (27) అకస్మాత్తుగా బలవన్మరణానికి పాల్పడ డంతో గ్రామం లో విషాదఛాయలు అలముకున్నాయి. ఎప్పు డూ చలాకీగా ఉంటూ..అందరితో కలుపుగోలుతనంగా వ్యవహరించే మూర్తి ఆత్మ హత్య చేసుకోవడాన్ని ఎవరూ జీర్ణించుకోలేకపోతున్నారు. మూర్తి తండ్రి వీరబాబు టీడీపీ సీనియర్ నా యకుడు కాగా ప్రస్తుతం చిరువ్యాపా రం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చేతికందివచ్చి న కుమారుడు, వివాహం చేయాలనుకుంటున్న తరుణంలో అకాల మరణం చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



రోధిస్తున్న కుటుంబసభ్యులు, కాకినాడ లాడ్జి ఎదురుగా రోడ్డుపై బైఠాయించి ఆందోళనచేస్తున్న బాధితులు

సొసైటీ సొమ్ములు దుర్వినియోగంపై విచారణ

కరప ఇన్‌చార్జ్ సీఈవోగా గత ఏడాది సెప్టెంబరులో నారాయణమూర్తి బాధ్యతలు తీసుకున్నారు. కాగా సొసైటీలో రుణాలు తీసుకున్న కొంతమంది రైతులు ఇటీవలె ఆ తీసుకున్న బాకీలను తిరిగి కట్టారు. అయితే వారిలో ఒక రైతు లోను సొమ్ము జమయ్యిందా అని స్థానిక కో-ఆపరేటివ్ బ్రాంచ్‌లో కట్టిన రసీదును అధికారులకు చూపించినట్టు తెలిసింది. రికార్డులో ఆ సొమ్ము కట్టినట్టులేకపోవడంతో అనుమానం వచ్చిన కో-ఆపరేటివ్ బ్యాంక్ అధికారులు సొసైటీలోని ఎల్‌టీ, ఎస్‌టీ, రైతునేస్తం, తదితర రికార్డులను పరిశీలించగా పెద్దమొత్తంలో రుణాల సొమ్ము పక్కదారి పట్టినట్టు తేలింది. దీనికి మూర్తిని బాధ్యుడిని చేస్తూ వెంటనే ఆ సొమ్ములు చెల్లించాలని అధికారులు పట్టుబట్టినట్టు సమాచారం. అంతవరకు ఇన్‌చార్జ్ సీఈవోగా జడ్.బావారం సీఈవో వెంకటేశ్వరరావుకు బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది. సీఈవోగా తనను తప్పించడం, చేయని తప్పుకు బాధ్యుడ్ని చేయడం అవమానంగా భావించి నారాయణమూర్తి ఆత్మహత్యకు పాల్పడినట్టుగా సన్నిహితులు చెబుతున్నారు. దీనిపై కరప సొసైటీ స్పెషలాఫీసర్ దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా రికార్డుల ప్రకారం రూ.12లక్షల వరకు సొసైటీ సొమ్ములు దుర్వినియోగమైనట్టుగా విచారణలో తేలిందన్నారు. అందులో కొంత సొమ్ము రికవరీ అయ్యిందని, మిగిలిన సొమ్ములను కట్టమని మూర్తి కుటుంబ సభ్యులకు సూచించామని, ఇంతలో ఇలా జరగడం దారుణమని ఆయన విచారం వ్యక్తంచేశారు.

‘ఎమ్మెల్యే గారు మా ఫ్యామిలీకి హెల్ప్ చేయండి ’

అమ్మా, నాన్న, అక్క, బావ అందరూ కలిసి ఉండండి..మిత్రులారా లగ్జరీకి పోకుండా జాగ్రత్తగా ఉండండి.. నేనెవరికీ రూపాయి కూడా ఇవ్వక్కర్లేదు..చేయని తప్పుకు నన్ను ఇరికించారు...జనసేనకు సపోర్టు చేశానని చాలా బాధపెట్టారు. ఇప్పుడు జనసేన అధికారంలోకి వచ్చినా సుఖం లేదు. ఎమ్మెల్యేగారు మా ఫ్యామిలీకి ఏమైనా హెల్ప్ చేయండంటూ... నారాయణమూర్తి ఆత్మహత్య చేసుకోవడానికి ముందు రాసిన మూడు సూసైడ్ నోట్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

బంధువుల ఆందోళన

కాకినాడలోని లాడ్జి నిర్వాహకుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ మృతుడి బంధువులు, స్నేహితులు లాడ్జి ఎదురుగా రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. మృతిపై తమకు అనుమానాలున్నాయని, సీసీ టీవీ ఫుటేజీ ఇవ్వాలని లాడ్జి యాజమాన్యాన్ని వారు ప్రశ్నించారు. అంతవరకు మృతదేహాన్ని తరలించడానికి అంగీకరించమంటూ భీష్మించుకుని కూర్చున్నారు. సీసీ కెమేరాలున్నాయి గానీ, కొంతకాలంగా అవి పని చేయడంలేదని లాడ్జి నిర్వాహకులు చెప్పడంతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. కాకినాడ టూటౌన్ పోలీసులు బాధితులతో మాట్లాడి శాంతింపజేయడంతో ఆందోళన విరమించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమి త్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశారు.

మండపేటలో రూ.30 కోట్లకు టోకరా?

- అటు భక్తిమార్గం.. ఇటు వడ్డీ వ్యాపారం
- అధిక వడ్డీ ఆశతో భారీగా అప్పులిచ్చిన మహిళా భక్తులు
- బోర్డు తిప్పేయడంతో బాధితులు లబోదిబో

మండపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భక్తిముసుగు లో మహిళా భక్తులే లక్ష్యంగా అధికవడ్డీ ఎరజూపి వారి వద్ద నుంచి లక్షలాది రూపాయలు సేకరించి ఏకంగా రూ.30 కోట్ల మేర బోర్డును తిప్పేసిన సంఘటన ఆలస్యంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మండపేటలో వెలుగుచూసింది. మండపేటకు చెందిన ఒక వ్యక్తి గత కొంతకాలం నుంచి దేవుడు ముసుగులో భక్తులను ఆకర్షించి వారితో మండపేట పరిసర ప్రాంతాల్లో భజనలు, కీర్తనలు నిర్వహిస్తూ వస్తున్నా డు. అధిక వడ్డీ ఇస్తానని చెప్పడంతో చాలామంది మహిళా భక్తులు అతడిని నమ్మి తమ వద్ద ఉన్న నగదును ఇచ్చారు. దీంతో అటు భక్తి కార్యక్రమాలు, ఇటు వడ్డీ వ్యాపారం నిర్వహి స్తూ మహిళల నుంచి ఏకంగా రూ.30కోట్ల వరకు తీసుకున్నాడు. కొన్నాళ్లపాటు సక్రమంగా వడ్డీ ఇస్తూ వచ్చిన అతడు ఆకస్మికంగా జెండా ఎత్తేశాడు. ఇంట్లో తెలిసి కొందరు, తెలియకుండా కొందరు మహిళలు లక్షలాది రూపాయలను ఇతడికి ఇచ్చినట్టు సమాచారం. ఇప్పుడు ఆ వ్యక్తి కనిపించకపోవడం, ఫోన్ పనిచేయకపోవడంతో వీరంతా మోసపోయి నట్టు గ్రహించారు. పట్టణంలోని కొందరు పెద్దల వద్ద ఈ మోసాన్ని చెప్పి న్యాయం చేయాలని వేడుకోగా, మరికొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నట్టు తెలిసింది. సదరు వ్యక్తికి ఉన్న ఆస్తులకు, అప్పులకు ఏమాత్రం సంబంధం లేకుండా ఉండడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. కాగా ఈ వ్యక్తిపై ఎటువంటి ఫిర్యాదు పోలీసులకు అందలేదు. ఏదొక విధంగా సొమ్ములు వస్తాయనే ఆశతో పెద్దలవద్ద పంచాయతీ జరుగుతున్న నేపథ్యంలో వేచిచూసే ధోరణిలో ఉన్నారు. న్యాయం జరగకపోతే పోలీసులకు ఫిర్యాదు చేయాలని భావిస్తున్నారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



మృతుడు సూరాడ అప్పారావు

కొత్తపల్లి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన ఉప్పాడలో చోటుచేసుకొంది. మత్స్యకారులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరాడపేటకు చెందిన సూరాడు అప్పారావు(19) శుక్రవారం సహచర మత్స్యకారులతో వేటకు వెళ్ళాడు. వేట సమయంలో సముద్రంలో కెరటాల ఉధృతికి వల లాగుతున్న అప్పారావు దురదృష్టవశాత్తు జారి సముద్రంలో పడి గల్లంతయ్యాడు. మత్స్యకారులు సాయంత్రం వరకు వలలతో గాలింపు చర్యలు చేపట్టడంతో అప్పారావు మృతదేహం వలకు చిక్కడంతో ఒడ్డుకు చేర్చారు. వేట ముగించు కుని త్వరగా ఇంటికి చేరుకుంటానన్న అప్పారావు మాట తలచుకొని కుటుంబ సభ్యులు విలపిస్తుంటే చూపరుల కంటతడిపెట్టించింది.

వ్యక్తిగత కారణాలతో..

వృద్ధ దంపతుల ఆత్మహత్య

- విదేశాల్లో స్థిరపడిన పిల్లలు..
- మానసిక ఒత్తిడితో కాకినాడ ఉప్పుటేరులోకి దూకి బలవన్మరణానికి పాల్పడిన దంపతులు

కాకినాడ క్రైం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురై కాకినాడ జగన్నాథపురం ఉప్పుటేరులోకి దూకి దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కాకినాడ జగన్నాథపురానికి చెందిన వృద్ధ దంపతులు ఎం.ఆదిమూర్తి(65), ధనలక్ష్మి(60) భార్యభర్తలు. కాగా వారి పిల్లలు విదేశాల్లో స్థిరపడడంతో ఆ వృద్ధ దంపతులు కాకినాడలో ఉంటున్నారు. వారిలో ఒకరు అనారోగ్యం పాలైతే మరొకరు వారి ఆలనాపాలనా చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విధంగా వారు మానసిక ఒత్తిడికి, శారీరక ఒత్తిడికి గురౌతున్న నేపథ్యంలో తీవ్రమనస్తాపానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో వారిద్దరూ మరణమే శరణ్యమని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం జగన్నాథపురం ఎన్‌టీఆర్ వారధి వద్దకు వచ్చి ఉప్పుటేరులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అనంతరం కుటుంబసభ్యులు విగతజీవులుగా మారిన ఆ వృద్ధ దంపతులను గుర్తించి మృతదేహాలను ఖననం నిమిత్తం స్వగృహానికి తరలించారు. ఈ విషయంపై కాకినాడ వన్‌టౌన్ సీఐ నాగదుర్గారావును వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని, అందువల్ల కేసు నమోదు చేయలేదని తెలిపారు.

వివాహిత హత్యకేసులో

వీడిన మిస్టరీ

- పందలపాక హత్యకేసులో వ్యక్తి అరెస్టు
- వివాహేతర సంబంధమే కారణం

బిక్కవోలు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వివాహిత హత్యకేసులో మిస్టరీ వీడింది. తూర్పుగోదావరిజిల్లా బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన వివాహిత లలితేశ్వరి ఈనెల 29న ఆమె పనిచేస్తున్న బరకాల కొట్టులో మృతి చెందిన ఘటన విధితమే. దీనిపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ మేరకు శుక్రవారం అనపర్తి సీఐ సుమంత్ వివరాలు వెల్లడించారు. సంచుల కొట్టులో గుమస్తాగా పనిచేస్తున్న లలితేశ్వరికి అదే గ్రామానికి చెందిన గుంతికోలు దుర్గాప్రసాద్‌కు గత కొంతకాలంగా పరిచయం ఉంది. అయితే ఇటీవల లలితేశ్వరి దుర్గాప్ర సాద్‌ను దూరం పెట్టడంతో కోపం పెంచుకున్నాడు. ఇదిలావుండగా ఈనెల 29న తెల్లవారుజామున ఆమె పనిచేస్తున్న సంచుల కొట్టు వద్దకు పిలిచాడు. ఆమె వాకింగ్‌కు వెళుతున్నానని చెప్పి సంచుల కొట్టు వద్దకు వెళ్లింది. అక్కడే ఉన్న దుర్గాప్రసాద్ తనను దూరం పెట్టడంపై లలితేశ్వరితో వివాదానికి దిగాడు. ఈ వివా దం పెరిగి దుర్గాప్రసాద్ కేబుల్ వైరుతో మెడకు చుట్టి గట్టిగా నొక్కి చంపేసి పారిపోయాడు. ఈ మేరకు సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడైన దుర్గాప్రసాద్‌ను గురువారం రాత్రి 11 గంటలకు పందలపాక సెంటర్‌లో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని తెలిపారు. మృతురాలి హత్యకేసులో ఇంకా ఎవరైనా ఉ న్నారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు

అసలేం జరిగింది ?

తణుకు రూరల్ ఎస్ఐ మూర్తి మరణంపై భిన్న వాదనలు

ఆత్మహత్య చేసుకున్నాడు

- సోదరుడు, సోదరి

‘చిన్నప్పటి నుంచి అనుకున్నది సాధించాలనే పట్టుదల ఉన్న వ్యక్తిత్వం తనది. ఇప్పటి వరకు జిల్లా కేంద్రంలో వున్న మూర్తిని, ఏలూరు రేంజిలో రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు చెప్పారు. దీంతో ఎక్కడ తనకు దూరంగా పోస్టు వస్తుందోనని భావించాడు. జరిగిన దానిని వదిలేయ్ మళ్లీ ఉద్యోగం వస్తుంది. ధైర్యంగా ఉండు. లేదంటే ఉద్యోగం వదిలేసి వచ్చేయమని చెప్పాం. ఉదయం స్టేషన్‌కు వెళ్లిన కొద్దిసేపటికే రివాల్వర్‌తో కాల్చుకుని చనిపోయాడు. పోలీసులు, మీడియా తీరు వల్లే ఇలా జరిగింది. సంబంధం లేని విషయాన్ని పెద్దభూతంలా చేశారు. ఇప్పుడు మనిషే పోయాడని సోదరుడు వెంకటేశ్, సోదరి శ్రీలక్ష్మి కన్నీరు మున్నీరుగా విలపించారు. ‘మూర్తి ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదు. అతని ఫోన్ కాల్ లిస్టు బయటపెట్టాలి. అతని మృతిపై అనుమానాలు ఉన్నాయి. అధికారుల వేధింపులు ఉన్నాయా ? అనే విషయం తేలాలి. సెల్‌ఫోన్, వీడియోలు బయటపెట్టాలి’ అని ఆయన స్నేహితుడు కె.గంగవరానికి చెందిన వెంకటరమణ డిమాండ్ చేశారు.

తణుకు/కె.గంగవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వీఆర్‌లో వున్న తణుకు రూరల్ ఎస్ఐ ఏజీఎస్ మూర్తి(38) మృతిపై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మూర్తి ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు, బ్యాచ్‌మేట్స్, కుటుంబ సభ్యులు ఆరోపిస్తుంటే.. కాదు గన్‌మిస్ ఫైర్ అయ్యిందని జిల్లా ఎస్పీ నయీం అస్మి చెబుతున్నారు. కుటుంబ సభ్యులు, సహోద్యోగుల కథనం ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరానికి చెందిన ఆదుర్తి గోపాలరావు, తల్లి సూర్యావతిలకు ఇద్దరు



స్టేషన్ వద్ద బంధువులు

కుమారులు వెంకటేశ్, మూర్తి, కుమార్తె శ్రీలక్ష్మి. మూర్తి టెన్త్ వరకు స్వగ్రామంలోనే చదివాడు. ఎంతో కష్టపడి 2012లో ఎస్ఐ ఉద్యోగం సాధించాడు. విజయలక్ష్మితో వివాహం కావడంతో వీరికి కుమారుడు చందన్(5) కుమార్తె హేమాన్షి (16 నెలలు) ఉన్నారు. పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని మచిలీపట్నం, కైకలూరు, భీమవరం టూ టౌన్, పాలకోడేరు, పెరవలి, నరసాపురం రూరల్, ఆచంట, తణుకు రూరల్ స్టేషన్‌లలో పనిచేశాడు. వేల్పూరులో రెండు గేదెల అపహరణ కేసులో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో నాలుగు నెలలు క్రితం పోలీసు ఉన్నతాధికారులు వీఆర్‌లో పెట్టారు. అప్పటి నుంచి తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. తనకు సంబంధం లేని కేసులో వీఆర్‌కు పంపారని



ఎస్ఐ మూర్తి

అవమానంగా భావించాడు. పెనుగొండలో సీఎం పర్యటనకు బందోబస్తుగా వెళ్లాలని ఆదేశాలు రావడంతో.. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు తణుకు రూరల్ పోలీసుస్టేషన్‌కు బైక్‌పై వచ్చాడు. కొంతసేపటికి సర్వీసు రివాల్వర్ తీసుకుని పక్కనే ఉన్న వాష్ రూమ్‌కు వెళ్లి కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ విషయం తెలియగానే ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన 2012 బ్యాచ్ ఎస్ఐలు పెద్ద ఎత్తున తణుకు ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. అందరికి ధైర్యం చెప్పే మూర్తి ఇలా ఎందుకు చేశాడోనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన పోలీసు శాఖలో కలకలం రేగింది. ఉన్నతాధికారుల నుంచి రకరకాల ఒత్తిళ్ల సిబ్బందిని కుంగిపోయేలా చేస్తున్నాయనే విమర్శలు వచ్చాయి.

రివాల్వర్ మిస్ ఫైర్ : ఎస్పీ నయీం



‘ఎస్ఐ మూర్తి ఉదయం స్టేషన్‌కు వచ్చారు. అందరితోనూ మాట్లాడి వాష్ రూమ్‌కు వెళ్లారు. అక్కడ రివాల్వర్ మిస్ ఫైర్ అయ్యింది. దీనిని గమనించి సిబ్బంది 108లో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మూర్తి చనిపోయారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి వాస్తవాలు వెలుగులోకి తెస్తాం’ అని పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ నయీం అస్మి తెలి పా రు. ఆయన వెంట ఏఎస్పీ భీమారావు తదితరులున్నారు. ఎస్ఐ కుటుంబానికి న్యాయం చేస్తామని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. ఆసుపత్రిలో మూర్తి మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కోటిపల్లిలో శనివారం పోలీసు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలకు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు పామర్రు ఎస్ఐ ఎస్కే జానీ బాషా చెప్పారు.

ఆర్యవైశ్యులకు అండగా టీడీపీ ప్రభుత్వం

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్యసంఘ అధ్యక్షుడు కంచర్ల

రాజోలు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులకు అండగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తుందని ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఆర్యవైశ్యసంఘ అధ్యక్షుడు కంచర్ల బాబి అన్నారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి ఆర్యవైశ్యసంఘ అధ్యక్షుడు కంచర్ల బాబి ఆధ్వర్యంలో తాటిపాకలో శుక్రవారం ఆర్యవైశ్యులు వాసవీ అమ్మవారి నగర సంకీర్తన ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు. జిల్లాలో బాబి పిలుపు మేరకు ప్రతీ గ్రామంలో, ప్రతీ మండలంలో ఉన్న ఆర్యవైశ్యులు ఎంతో భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. కొత్తపేట శ్రీ వాసవీ కల్యాణ మండపంలో వెలసిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి జిల్లా అధ్యక్షుడి హోదాలో బాబి పట్టువస్త్రాలు సమర్పించారు. అల్లవరం మండలం బోడసకుర్రులో కుంకుమ పూజలు చేశారు. అమ్మవారికి చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలనచేసి వాసవీమాత సహస్రశ్లోకం పఠించారు. ఈ సందర్భంగా బాబి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా జీవో తీసుకువచ్చి అమలు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, వాణిజ్య మంత్రి టీజీ భరత్, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డి.రాకేష్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం కోశాధికారి కంచర్ల కృష్ణమోహన్, ఉపాధ్యక్షుడు పోశెట్టి సూరిబాబు, అదనపు కార్యదర్శి కాసు శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి లక్కింశెట్టి నానాజీ, యెండూరి పవన్‌కుమార్, గమిడి సూరిబాబు, పి.కృష్ణారావు, బాబి పాల్గొన్నారు.



తాటిపాకలో శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్యసంఘ అధ్యక్షుడు కంచర్ల బాబి

జీజీహెచ్‌లో వివాదం

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో ఓ నర్సు వివాదాస్పదంగా వ్యవహరించడంతో శుక్రవారం ఆస్పత్రిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆస్పత్రిలో మేల్ నర్సుగా పని చేస్తున్న పోలా బత్తిన శ్రీనివాసరావు ఇటీవల రిపబ్లిక్‌డేలో కలెక్టర్ అందించిన అవార్డుల ప్రదానోత్సవంలో పేర్లు సిఫార్స్ చేయడంలో ఆస్పత్రి అధికారులు పక్షపాత వైఖరిని అవలంబించారని ఆరోపించాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం కొన్ని ఖాళీపత్రాలపై కొందరు ఉద్యోగులతో అవార్డులు ఇచ్చిన తీరు అసంతృప్తిగా ఉందని సంతకాలు చేయించాడు. ఆస్పత్రి ఉద్యోగ సంఘం జేఏసీ మద్దతు తనకు ఉందని ప్రచారం చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న జేఏసీ నాయకులు మేల్ నర్సు వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఈవిషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని జేఏసీ స్పష్టం చేసింది..

రాజ్యసభ సభ్యుడు పిల్లి బోస్‌కు అస్వస్థత



ద్రాక్షారామ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ స్వల్ప అస్వస్థతకు గుర య్యారు. ఈ విషయంపై ఆయన కుమారుడు నియో జకవర్గ ఇన్‌ఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్‌ను సంప్ర దించగా శుక్రవారం ఉదయం పార్లమెంటు కు ఏవిధమైన ఆహారం తీసుకోకుండా వెళ్లడం వలన షుగర్ లెవెల్స్ తగ్గిపోవడంతో అస్వస్థతకు గురయ్యారని చెప్పారు. ప్రస్తుతం కోలుకుంటున్నారని చెప్పారు.

యానిమేటర్ ఆర్పీలకు

ఉద్యోగ భద్రత కల్పించాలి

- యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి

రాజమహేంద్రవరంఅర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే యానిమేటర్లు అందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ యానిమేటర్ల ఆర్పీల యూనియన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షురాలు ఎం.శ్రీదేవి కోరారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో యానిమేటర్లు ఆర్‌పీల యూనియన్ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. శ్రీదేవి మాట్లాడుతూ అర్బన్‌లో ఉన్న సంఘాలను రూరల్‌లోకి మార్చాలని, 64 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ప్రభుత్వ ఉద్యోగి, చిరుద్యోగులు, ఔట్ సోర్సింగ్ తదితర ఉద్యోగులు అందరూ కూటమి ప్రభుత్వం హామీలను నమ్మి ఓట్లు వేశారని వారికి న్యాయం చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రతి చిరుద్యోగికి రూ.26,000 జీతం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కనక, కోశాధికారి ఆర్.వరలక్ష్మి మాట్లాడారు. ముందుగా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్, జట్ల లేబర్ యూనియన్ అధ్యక్షుడు కె.రాంబాబు, మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పి.లావణ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా, తూర్పుగోదావరి జిల్లాలకు నూతన కమిటీలను ఎన్నుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి



రాజమహేంద్రవరంలోని పుష్కరాల రేవు వద్ద మానవహారం నిర్వహిస్తున్న పోలీసులు, ఫ్లెక్సీతో ర్యాలీ చేస్తున్న పోలీసులు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ

- తూర్పుగోదావరిజిల్లా పోలీస్ ఆధ్వర్యంలో మానవహారం

రాజమహేంద్రవరంసిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో 200మంది పోలీసులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు ఈర్యాలీని స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు ప్రారంభించారు. ఈ ర్యాలీ అజాద్ చౌక్, దేవీచౌక్, గోకవరం బస్టాండ్ మీదుగా పుష్కరాల రేవువరకు సాగింది. అక్కడ పోలీసులు మానవహారం నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ, ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య, ఏఆర్ డీఎస్పీ రవికుమార్, ఎస్‌బీ సీఐ ఏ శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్-1 నబి, ఇన్‌స్పెక్టర్-2 సీహెచ్ సూరిబాబు, వన్‌టౌన్, బొమ్మూరు, ధవళేశ్వరం, కడియం సీఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సర్ ఆర్ధర్ కాటన్ నర్సరీ సంఘం డైరీ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న నర్సరీ సంఘం ప్రతినిధులు

కడియం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కడియపులంకలోని సర్ ఆర్ధర్ కాటన్ నర్సరీ సంఘ కార్యాలయంలో అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు ఆధ్వర్యంలో శుక్రవారం సంఘ డైరీని ఆవిష్కరించారు. నర్సరీ పెద్దలు మార్గాని సత్యనారాయణ, గట్టి సుబ్బారావు, పాటంశెట్టి చిన మహాలక్ష్మీనాయుడు, తాడాల చక్రవర్తి, తిరుమలశెట్టి భాస్కరరావు, రత్నం కృష్ణమూర్తి, బొర్సు సుబ్బారాయుడు, బొర్సు వెంకటేశ్వరరావు, నర్సరీ రైతులు, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పెనుమాక కొండబాబు, కార్యవర్గ సభ్యులు గాద నాగేశ్వరావు, ఘట్టా కృష్ణభగవాన్, రావిపాటి రామకృష్ణ, తాడాల బాలమురళీకృష్ణ, జంగా సుబ్బారావు, గరగ నాగేశ్వరరావు, అడ్డగర్ల రమేష్, తాడాల నాగేశ్వరరావు, గాజుల రత్తయ్య, పిల్లా శ్రీను, కొండేపూడి నాగు, వడ్ల మూరి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా టీడీపీ

● మండల టీడీపీ అధ్యక్షుడు నాని



కడియంలో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమం

కడియం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులకు టీడీపీ అండగా పనిచేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెలుగుబంటి నాని తెలిపారు. స్థానిక వాసవీ కల్యాణమండపంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్యుల సంఘం అధ్యక్షుడు గ్రంధి నాగబాబు ఆధ్వర్యంలో జరిగాయి.ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాని హాజరయ్యారు. నాని మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా జీవో తెచ్చిందన్నారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గ్రంధి నాగు, నేతి నానాజీ, చెక్కా కాశీ, బొడ్డు సత్యనారాయణ, వెత్సా లక్ష్మీనారాయణ, ఒబ్బిలిశెట్టి సాయి, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేవీటీలో స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు శిక్షణ



స్థానిక ఎస్‌కేవీటీలో విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ క్యాంప్

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బాలబాలికల్లో దేశభక్తి, క్రమశిక్షణ పెంపొందించి వారిని సమాజ సేవకులుగా తీర్చిదిద్దాలని స్కౌట్స్ ఏఎల్టీలు డీఎల్ నారాయణ, పి.వెంకటరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలకు చెందిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కి బేసిక్ ట్రైనింగ్ క్యాంప్ నిర్వహించారు. పీఎంశ్రీ స్కూల్స్‌కు చెందిన 31 మంది స్కౌట్స్, 31 మంది గైడ్స్ హాజరయ్యారు. కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సుభాషిణి, డీఈవో వాసుదేవరావు, ఏఎంవో గౌరీశంకర్, డీఐ దిలీప్, ప్రధానోపాధ్యాయులు ఎం.సుబ్రహ్మణ్యం, రాజ్‌కుమార్, వరాహగిరి కృష్ణమోహన్, నారాయణ, వెంకటరెడ్డి, కామేశ్వరి, కె.రత్నకుమారి, విశ్రాంత ఉపాధ్యాయుడు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో హెల్త్ ఎడ్యుకేటర్లు కీలకం

●డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు ● డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య పరిరక్షణలో హెల్త్ ఎడ్యుకేటర్ల పాత్ర కీలకమైందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కే.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏపీ హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్- 2025 డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. జిల్లా మీడియా విస్తరణాధికారి(డెమో) సత్యకుమార్, ఆఫీస్ సూపరింటెండెంట్ సత్యనారాయణ, స్టాలిన్, ఎపిడమాలజిస్ట్ సుధీర్, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాస్, హెచ్‌ఎస్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వాట్సప్ సేవలతో మరిన్ని సంస్కరణలు : బత్తుల

దివాన్‌చెరువు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన వాట్సప్ పరిపాలనతో మరిన్ని సంస్కరణలు చేయవచ్చని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సాంకేతికతను ప్రజలు అందిపుచ్చుకోవాలని చెప్పారు. అప్పుడే సరైన సేవలు అందుతాయన్నారు.

విద్యార్థులకు ఏకాగ్రత, ప్రణాళిక అవసరం

● ప్రతిభకు ప్రేరణలో కలెక్టర్ ప్రశాంతి
● జీజీయూలో కార్యక్రమం నిర్వహణ
● అధ్యక్షత వహించిన డీడీ శోభారాణి



ప్రతిభకు ప్రేరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజానగరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు ఏకాగ్రత, ప్రణాళిక అవసరమని కలెక్టర్ పి.ప్రశాంతి ఉద్బోధించారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులకు ప్రతిభకు ప్రేరణ కార్యక్రమాన్ని సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ)లో శుక్రవారం నిర్వహించారు.

దీనికి సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఎస్.శోభారాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను అన్వేషించుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీవితంలో ఏవిధంగా స్థిరపడాలనుకుంటున్నారో నిర్ణయించుకుని. ఆమేరకు కృషి చేయాలన్నారు. అందుకు 10 వతరగతి సరైన సమయమన్నారు. సాంఘిక సంక్షేమశాఖ డీడీ శోభారాణి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని వసతిగృహాలలోని 10 వ తరగతి విద్యార్థులకు పరీక్షరాసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు సంసిద్ధత గురించి అవగాహన కల్పించారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మాజీ ఉపప్రధాని బాబూజగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిజియు రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డీన్ ఎస్.లీలావతి, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, గైట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి జి రామానుజం, వసతిగృహ సంక్షేమాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముప్పిడిరాజు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ గవర్నెన్స్‌లో వర్చువల్‌గా సేవలు

● ప్రజలకు చేరువగా కూటమి ప్రభుత్వం
● ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్




ఎమ్మెల్యే శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ గవర్నెన్స్‌లో భాగంగా ప్రజలకు వర్చువల్‌గా సేవలందించేందుకు కూటమి ప్రభుత్వం సాంకేతికంగా ముందుకువెళ్లిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ కానున్నాయన్నారు. ఇకపై ఏ పని కావాలన్నా వాట్సాప్ ద్వారా సేవలను పొందే అవకాశం కల్పించేందుకు నిర్ణయం తీసుకోవడం మంచి ఆలోచన అన్నారు. ఇది పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చిన తర్వాత అత్యవసర సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడం, మౌలిక వసతులు కల్పించే ప్రాంతంలో స్థానిక ప్రజలకు సమాచారం పంపడం, ఈ-క్రాప్‌లో నమోదైన రైతులు ఏ సమయంలో ఏ మందులు వాడాలనే దానిపై కూడా సమాచారం అందించవచ్చని తెలిపారు. అలాగే వాట్సాప్ ద్వారా అవసరమైన సర్టిఫికెట్లను పొందే అవకాశాన్ని కల్పించనుందన్నారు. 9552300009 నెంబరుపై మన మిత్ర ద్వారా 161 పౌరసేవలు పొందవచ్చని, మరో 360 సేవలు త్వరలోనే అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఇక నుంచి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పనిఉండదన్నారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి సీఎం చంద్రబాబు ఆక్సిజన్ ఇచ్చారన్నారు.

ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలకు న్యాక్ బీ గ్రేడ్ గుర్తింపు

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలకు న్యాక్‌లో బీ గ్రేడ్ లభించిందని ఆ విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి శుక్రవారం ప్రకటిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 23,24 తేదీల్లో కళాశాలకు జైపూర్ నేషనల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అంజనీశర్మ, అమృత్‌సర్ గురునానక్ దేవ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కుల్‌జిత్‌కౌర్, మలప్పురం యూనివర్సిటీ ఆఫ్ కాలికట్, సీనియర్ ప్రొఫెసర్ మనోహరన్ మావిలా వచ్చి పరిశీలించారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో భరత నాట్యం, కూచిపూడి నృత్యాలతో చేసిన ప్రార్థనా గీతాలు అలరించాయి.

కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ 2వ మండల అధ్యక్షురాలిగా లక్ష్మి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా రాజమండ్రి 2వ మండల అధ్యక్షురాలిగా అధికారి లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తనను ఎన్నుకున్న బూత్ అధ్యక్షులు, క్రియాశీల సభ్యులు, నేతలకు ఈ సందర్భంగా ఆమె ధన్యవాదాలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు హారిక, రాజమహేంద్రవరం అసెంబ్లీ కో కన్వీనర్ రత్నారెడ్డి పాల్గొన్నారు.



సీఎంతో మాట్లాడుతున్న అప్పారావు, తదితరులు

సీఎం చంద్రబాబును కలిసిన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన సీఎం చంద్రబాబును మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా రాజమండ్రిలో పార్టీ చాలా బలంగా ఉందని సీఎం అభినందించారు. అనతరం పలు విషయాలపై మాట్లాడారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, యిన్నమూరి దీపు, తదితరులు ఉన్నారు. అలాగే చంద్రబాబును అమరావతిలో బీజేపీ నేత హారిక మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో సంక్షేమ పాలనపై సంతోషం వ్యక్తంచేశారు.

అనపర్తి మండల సమాఖ్య అధ్యక్షురాలిగా షేక్ ఫాతిమా



షేక్ ఫాతిమా

అనపర్తి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి మండల సమాఖ్య అధ్యక్షురాలిగా అనపర్తికి చెందిన షేక్ ఫాతిమా ఎన్నికయ్యారు. శుక్రవారం ఎంపీడీవో సమావేశపు మందిరంలో సమాఖ్య సర్వసభ్య సమావేశం ఇన్‌చార్జి ఏపీఎం పీ. సుప్రియ అధ్యక్షతన జరిగింది. దీనిలో భాగంగా గ్రామసంఘాల ఆధర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు మాట్లాడారు. కార్యదర్శిగా పడాల శ్రీదేవి, ఉపాధ్యక్షురాలిగా కర్రి వరలక్ష్మి, ట్రెజరర్‌గా కొమరం రాజేశ్వరి, జాయింట్ సెక్రటరీగా పోతూరి దుర్గాభవాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీసీలు పేర్ని నాయుడు, భీమునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పరిపాలనా సౌలభ్యం కోసమే పార్టీ కార్యాలయం

● ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సతీమణి వెంకటలక్ష్మి



జనసేన నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీమణి వెంకటలక్ష్మి

రాజానగరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పరిపాలనా సౌలభ్యం కోసమే పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించినట్టు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సతీమణి వెంకటలక్ష్మి అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డులో అత్యాధునికహంగులతో నిర్మించిన జనసేన కార్యాలయాన్ని ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు, వీర మహిళలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలి

● వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి



రైతులకు ఎలుకల నిర్మూలన మందు అందిస్తున్న ఏడీఏ శ్రీనివాసరెడ్డి

దివాన్‌చెరువు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రైతులంతా ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని సామూహికంగా చేపట్టాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డీ.శ్రీనివాసరెడ్డి అన్నారు. రాజానగరం మండలం సంపత్ నగరంలో శుక్రవారం జరిగిన సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రైతులందరూ తప్పక ఎలుకల మందు తీసుకుని, దానిని సామూహికంగా పెట్టడం ద్వారా నివారించవచ్చునన్నారు. మండల వ్యవసాయాధికారి ఎస్‌కే ఇమామిఖాసిం మాట్లాడుతూ రైతులందరూ రైతుసేవా కేంద్రంలో ఎలుకల మందును తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయాధికారి ఎన్.ప్రత్యూష్ , రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: చంద్రేడు, రంగంపేట గ్రామాల్లోని గ్రామరైతు సేవాకేంద్రాల వద్ద శుక్రవారం సామూహిక ఎలుకల నిర్మూలనకు ఉచితంగా మందు పంపిణీ చేసినట్టు ఏవో కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామూహిక ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించామన్నారు. ఎలుకలు వరిపంటలో చేస్తున్న నష్టాన్ని గురించి వివరిస్తూ వాటి నిర్మూలనకు విషపు ఎరను తయారుచేసి పొలాల్లో పెట్టే విధానాన్ని రైతులకు ప్రత్యక్షంగా వివరించారు. కార్యక్రమంలో వీఏఏ మహేష్,వీహెచ్‌ఏ శ్రీలత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



చంద్రేడులో రైతులకు మందును పంపిణీ చేస్తున్న ఏవో శ్రీనివాస్

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

గోకవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో శనివారం పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంపీడీవో గోవింద్ తెలిపారు. మండలంలో ఎన్టీఆర్ భరోసా, సామాజిక భద్రత పింఛన్లు మొత్తం 10,460 మందికి అందజేయనున్నారు.

బిక్కవోలు: మండలంలో శనివారం ఎన్టీఆర్‌భరోసా పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఎంపీడీవో వీ.శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. అన్నిరకాల పింఛన్లు కలిపి 10,537 వున్నాయని, వీటికి సంబంధించిన సొమ్ము రూ.4,42,79,000ను పంచాయతీ కార్యదర్శులకు అందజేశామన్నారు. శనివారం సాయంత్రానికి నూరు శాతం పింఛన్లు పంపిణీ చేయాలని సూచించామని ఆయన పేర్కొన్నారు.

మెళ్లూరులో లేగదూడల ప్రదర్శన



ప్రదర్శనలో ఉన్న లేగదూడలు

బిక్కవోలు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గత నెల 20 నుంచి నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్యశిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ఈసందర్భంగా మెళ్లూరులో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో కాకినాడ డీఎల్ డీఏ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శనను ఏర్పాటు చేసారు. ఇందులో 49 దూడలు పోటీపడ్డాయి. గ్రామానికి చెందిన పాడి రైతులు అమజాల శ్రీహరి, కొమ్మన మురళి, గొలకోటి వీరన్నకు చెందిన దూడలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. వీరికి జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ టి.శ్రీనివాసరావు బహుమతులను ప్రదానం చేశారు. శిబిరంలో 50 పశువులకు చికిత్స అందించారు. కార్యక్రమంలో ఏడీఏ డాక్టర్ వై. శ్రీనివాసరావు, డాక్టర్ నవీన్, డాక్టర్ ప్రణీత్, డాక్టర్ వీర్రాజు, డాక్టర్ రవికుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు నిలువుటద్దం.. గద్దర్

● జయంతి సభలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం నేతలు



గద్దర్ అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం నేతలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఒక సంఘర్షణ, అణచివేత, ఆకలి నుంచి పుట్టిన ఉద్యమాలకు నిలువెత్తు నిదర్శనం ప్రజా యుద్ధ నౌక గద్దర్ అని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం నేతలు అన్నారు. రాజమహేంద్రవరంలోని గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం గుమ్మడి విఠల్‌రావు (గద్దర్) 77వ జయంతిని సంఘం, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళుర్పించారు. ఇటీవల గద్దర్ అవార్డు అందుకున్న కోరుకొండ చిరంజీవి, దారా యేసురత్నం, గొట్టిముక్కల అనంతరావును సత్కరించారు. గద్దర్ అనునిత్యం అంబేడ్కర్ ఆశయాల కోసం కృషిచేసారని ప్రముఖ న్యాయవాది మర్రి బాబ్జీ, దళిత నాయకుడు నక్కా శ్రీనగేష్ అన్నారు. బ్యాంకు ఉద్యోగం చేసుకుంటూ జీవితం సాగించిన గద్దర్ దాన్ని త్యాగం చేసి అడవుల బాటపట్టి బతికున్నంత వరకు పోరాటం సాగించారన్నారు. కార్యక్రమంలో నక్కా సోమేశ్వరరావు, తురకల నిర్మల, మోతా నాగలక్ష్మి, ఉసురుమర్తి రామారావు, రాజబాబు, సోమబత్తుల విజయ్, అర్దాల కుమార్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుపై మక్కువ చూపాలి



రైతు సదస్సును ప్రారంభిస్తున్న కేవీకే సంచాలకుడు గోవిందరాజు

నల్లజర్ల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రైతులు ఉద్యాన పంటలను పండించేందుకు మక్కువ చూపించాలని కృషీవిజ్ఞాన కేంద్ర సంచాలకుడు బి.గోవిందరాజు అన్నారు. పార్వతీపురం విశ్వవిద్యాలయంలో చదువుతున్న 10 మంది విద్యార్థులు శుక్రవారం తెలికిచర్లలో ఏర్పాటు చేసిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటల ద్వారా రైతులకు స్థిర ఆదాయం లభిస్తుందని, కూలీల ఖర్చు తగ్గుతుందని, ప్రతికూల వాతావరణంలో సైతం ఆదాయం వస్తుందన్నారు. ఉద్యాన పంట వల్ల పచ్చదనం పెరిగి వర్షాలతోపాటు ప్రజలకు చల్లదానం కలిగిస్తాయన్నారు. ప్రభుత్వాలు సైతం ఉద్యాన పంటలకు ప్రోత్సాహకాలు ఇస్తోందన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి బబిత, టీడీపీ నాయకులు సుంకర సుబ్బారావు, చీమకుర్తి రామకృష్ణ, సర్పంచ్ బండి చిట్టి, డాక్టర్ అరుణకుమారి, పెదబాబు పాల్గొన్నారు.

వివాహానికి మెగాస్టార్ చిరంజీవికి ఆహ్వానం



శుభలేఖను అందిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ జేఆర్‌సీ కన్వెన్షన్ విష్పర్ వ్యాలీలో ఈనెల 8న జరగనున్న తన కుమారుడు నల్లమిల్లి మనోజ్‌రెడ్డి వివాహ వేడుకకు హాజరు కావాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో మెగాస్టార్ చిరంజీవిని కలిసి ఆహ్వానించారు. ఈయనవెంట జనసేన నాయకుడు రావాడ నాగు, ఎమ్ఎస్ఎన్ చౌదరి , తదితరులు ఉన్నారు.

రంగంపేట ఫొటోగ్రాఫర్స్ నూతన కార్యవర్గం



కార్యవర్గంతో ప్రమాణం చేయిస్తున్న ఫొటోగ్రాఫర్స్ జిల్లా మాజీ ట్రెజరర్ భాస్కర్

రంగంపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల ప్రొఫెషనల్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శుక్రవారం స్థానిక ఏడీబీ రోడ్డు పక్కన గల హర్ష కన్వెన్షన్‌లో జరిగింది. ముందుగా ఫొటోగ్రఫీ పితామహుడు డాక్టర్ లూయిస్ డాగురె చిత్రపటానికి ఏపీపీడబ్ల్యూఏ అధ్యక్షుడు పోసిన వీరేంద్ర కుమార్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కోని శ్రీను, నూతన కార్యవర్గ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రెసిడెంట్ కె.శ్రీనివాసరావు,వైస్ ప్రెసిడెంట్ జి.నాగేంద్ర,సెక్రటరీ కె.సత్యనారాయణ, ట్రెజరర్ జి.సతీష్, జాయింట్ సెక్రటరీషేక్‌లాల్ సాహెబ్, గౌరవ అధ్యక్షులు వి.నాగబాబు,గౌరవ సలహాదారులు కె. ఏలియా, కె.సాయిరాం, పదిమంది కార్యవర్గ సభ్యుల చేత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ ట్రెజరర్ భాస్కర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏపీపీడబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్షుడు పోసిన వీరేంద్ర కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యూనియన్ పట్ల అంకితభావంతో పని చేయాలన్నారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ కార్యదర్శి బెజగం కోటేశ్వరరావు, ట్రెజరర్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఆహారంలో నాణ్యత లోపిస్తే సహించం

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అడిషనల్ డైరెక్టర్ వెంకట్రాజు



గోపాలపురం హైస్కూల్లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న వెంకట్రాజు

గోపాలపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో ఆహారంలోని నాణ్యత లోపిస్తే సహించబోమని ఆ పథకం అడిషనల్ డైరెక్టర్ వెంకట్రాజు హెచ్చరించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వంటలు చేయాలని లేకుంటే, చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయనవెంట ఎంఈవో శ్రీనివాసరావు, హెచ్‌ఎం సోమరాజు, ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ నిర్వాహకులు, తదితరులు ఉన్నారు.

ఉమాదేవి సేవలు స్ఫూర్తిదాయకం

గోపాలపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో సమాజం మనకి ఏం చేసిందనేది ముఖ్యం కాదని మనం సమాజానికి ఏం చేశామన్నదే ముఖ్యమని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో టీడీ పీ మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, కొర్లపాటి రాము, జ్యేష్ట శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సారాతో మహిళ అరెస్ట్

రంగంపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని రంగంపేట మండలం, రంగంపేటలో గల సారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఇందులో కొత్తపల్లి దుర్గ అనే మహిళ నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఎస్‌ఐ దుర్గాప్రసాద్ పాటు సిబ్బంది ఉన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: సంక్రాంతికి వస్తున్నాం
సూర్యామినీ	: దేవా
సూర్యాప్యాలస్	: ప్రేమిస్తావా, మదగజరాజు
స్వామి	: సంక్రాంతికి వస్తున్నాం
శివజ్యోతి	: గేమ్ ఛేంజర్
అనుశ్రీ(సాయికృష్ణ)	: మదగజరాజు
రాజా	: మదగజరాజు
ఊర్వశి	: పుష్ప-2
రంభ	: స్కైఫోర్స్
మేనక	: మహిష
అప్సర	: డాకు మహారాజ్
కుమారి	: రాచరికం, పుష్ప-2
అశోక	: డాకు మహారాజ్
వీఎస్ మహల్(నామవరం)	: సంక్రాంతికి వస్తున్నాం
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: సంక్రాంతికి వస్తున్నాం
వెంకటసూర్య(కడియం)	: సంక్రాంతికి వస్తున్నాం
సత్యగౌరి (అనపర్తి)	: సంక్రాంతికి వస్తున్నాం
సూర్యశ్రీ (అనపర్తి)	: మదగజరాజు
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: మార్కో
రామకృష్ణ(కోరుకొండ)	: ---
గీతాసినిమాస్ (సీతానగరం)	: పుష్ప-2
శ్రీనివాస (గోకవరం)	: అమరన్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: పుష్ప-2, ముఫాసా
లలితామహల్(రంపచోడవరం)	: పుష్ప-2
నవయుగ(చింతూరు)	: -----

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 1 ఫిబ్రవరి 2025 | 3



డీపీవోగా శాంతామణి

రాజమహేంద్రవరం రూరల్ జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామ పంచాయతీ అధికారి(డీపీవో)గా వి శాంతామణి నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి.గతంలో కొవ్వూరు డివిజనల్ డవలప్‌మెంట్ అధికారిగా పనిచేశారు. పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది.జిల్లాలో ఎమ్మెల్సీ కోడ్ ఉన్న కారణంగా ఉత్తర్వులపై సందిగ్ధత నెలకొంది.

నేడే పింఛన్ల పంపిణీ

2.36 లక్షల మందికి రూ.102.14 కోట్ల అందజేత



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పింఛన్లు పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో శనివారం 9041 క్లస్టర్ ఏరియాల్లో 5158 మంది పీడీవోల ద్వారా పింఛన్లు పంపిణీ చేయిస్తామన్నారు. జిల్లాలో 2 లక్షల 36 వేల 331 మందికి ఎన్‌టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు నేపథ్యంలో క్షేత్రస్థాయి అధికారులు,పెన్షన్ పంపిణీ చేసే సిబ్బందికి తగిన సూచనలు చేశామన్నారు.ఉదయం 6 గంటల నుంచే పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. జిల్లాలో 2,36,331 మందికి 17 కేటగిరీల్లో రూ.102 కోట్ల 14 లక్షల 40 వేలు లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు.జిల్లాలో 11 బ్యాంకులకి చెందిన 71 బ్రాంచీల నుంచి నగదు ఉపసంహరణ ప్రక్రియ పూర్తిచేశామన్నారు.

ఎలుకల మందు ఉచితం

రైతులు సామూహికంగా చేపడితేనే ఎలుకల నిర్మూలన

నిడదవోలు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రైతులంతా సామూహిక ఎలుకల నివారణ చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు అన్నారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెం రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం ఎలుకల నివారణ మందును ఉచితంగా పంపిణీ చేసి మాట్లాడారు. ఎలుకల నివారణకు ప్రభుత్వం తెల్ల రంగు బ్రోమోడయోలిన్ మందును ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తుందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు.రైతులు ఈ మం దును ఎలుకలు బొరియల్లో పెట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏవో జి.సత్యనారాయణ, వ్యవసాయ సహాయకులు మాధవన్,శివనాగు పాల్గొన్నారు.



కేన్సర్ స్క్రీనింగ్ మెషీన్ అందజేత

రామకృష్ణమిషన్ వైద్యశాలకు ఇచ్చిన రోటేరియన్లు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం గోదావరి గట్టున ఉన్న రామకృష్ణ మిషన్ ధర్మవైద్యశాలకు రూ.8 లక్షలు విలువైన కేన్సర్ స్క్రీనింగ్ మెషీన్‌ను అందజేసినట్టు రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ అధ్యక్షుడు నాళం నరసింహరావు తెలిపారు. రామకృష్ణ మిషన్ వైద్యశాల ఇన్‌ఛార్జి స్వామి రఘువీరనందజీ మహరాజ్, డాక్టర్ ఇన్నమని రామచంద్రరావులకు మెషీన్‌ను అప్పగించారు.తమిళనాడు రోటరీ డిస్ట్రిక్టు 2982 వారికి వచ్చిన సీఎస్ఆర్ నిధులతో ఈ కేన్సర్ స్క్రీనింగ్ మిషన్‌ను సమకూర్చారని, రోటరీ డిస్ట్రిక్టు 3020 ద్వారా అందజేయడం జరిగిందన్నారు.కార్యక్రమంలో రొటేరియన్లు గాదె కిషోర్, సుంకర నాగేంద్ర కిషోర్, ఎస్‌జీ శ్యామ్‌సింగ్, అనూప్ జైన్, బలభద్ర మోహన్,శకుంతల పాల్గొన్నారు.



కేన్సర్ స్క్రీనింగ్ మిషన్ అందజేస్తున్న దాతలు

ఎమ్మెల్సీ ఎన్నికలకు నోడల్ అధికారుల నియామకం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజవర్గ శాసన మండలి ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు నోడల్ అధికారులను నియమిస్తున్నట్టు జేసీ ఎస్.చిన్నరాముడు తెలిపారు.ఈ మేరకు తన చాంబర్‌లో శుక్రవారం నోడల్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఈనెల 3న నోటిఫికేషన్ విడుదల చేసి నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. 10వ తేదీతో నామినేషన్ల ముగింపు, 11న నామినేషన్ల పరిశీలన, 13న అభ్యర్థుల ఉపసంహరణ, 27న ఉదయం 8నుంచి సాయంత్రం 4 గంటలకు పోలింగ్ , మార్చి 3న కౌంటింగ్ ఉంటుందన్నారు. మార్చి 8వ తేదీన ఎన్నికల కోడ్ ముగుస్తుందన్నారు.ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా నోడల్ అధికారులు విధులు నిర్వహించాలన్నారు. నోడల్ అధికారుల వివరాలు వెల్లడించారు.

నేడో రేపో రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ల బదిలీ

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే కౌన్సెలింగ్ పూర్తి కావడంతో నేడో, రేపో ట్రాన్స్‌ఫర్ ఉత్తర్వులు రావొచ్చని భావిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రైతుబజార్లు రాజమహేంద్రవరం సిటీలోనే ఏడు ఉన్నాయి.వీటితో పాటు శాటిలైట్ సిటీ, కొవ్వూరులో ఒక్కో రైతుబజార్ ఉన్నాయి. రైతుబజార్లలో పనిచేస్తున్న ఎస్టేట్ ఆఫీసర్లు అంతా రెండేళ్లకు పైనే ఆయా ప్రదేశాల్లో పనిచేస్తున్నారు. దీంతో ఎస్టేట్ ఆఫీసర్లను బదిలీ చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. సంక్రాంతి పండగ ముందే కౌన్సెలింగ్ కూడా పూర్తి చేశారు. ఎస్టేట్ ఆఫీసర్లతో పాటు రైతు బజార్లలోని సెక్యూరిటీ సిబ్బందిని బదిలీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ బదిలీలన్నీ అంతర్గతంగానే జరుగుతున్నాయి. దాదాపుగా రాజమహేంద్రవరం సిటీలోనే ఒక బజారు నుంచి మరో బజారుకు మాత్రమే మారుస్తున్నారు.జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలో కౌన్సిలింగ్ ప్రక్రియ అంతా పూర్తి కావడంతో పాటు జిల్లా మార్కెటింగ్ అధికారి ద్వారా ఫైలు సం బంధిత పై అధికారులకు పంపడంతో ఒకటి, రెండు రోజుల్లోనే బదిలీ ఉత్తర్వులు రావొచ్చని భావిస్తున్నారు.బదిలీల కౌన్సెలింగ్ పూర్తి కావడంతో ఎస్టేట్ ఆఫీసర్లు ఉత్తర్వులకు ఎదురుచూస్తున్నారు.

నేటి నుంచి ఇంటర్ పబ్లిక్ అర్హత పరీక్షలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి):ఇంటర్మీడియెట్ 2025 పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులంతా ఈ నెల 1,3 తేదీల్లో జరిగే అర్హత పరీక్షలు రాయాలని ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్, ఒకేషనల్ విద్యార్థులంతా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నైతికత మానవీయ విలువలు పరీక్ష రాయాలన్నారు.3వ తేదీన పర్యావరణ విద్య పరీక్ష రాయాలన్నారు. జిల్లాలో అన్ని మేనేజ్‌మెంట్ జూనియర్ కళాశాలల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. పరీక్షలకు జనరల్ 20,591 మంది ,ఒకేషనల్ నుంచి 2226 మంది విద్యార్థులు హాజరవుతారని ఆర్ఐవో చెప్పారు.

తణుకు రూరల్ ఎస్ఐ మృతి 6
ఘటనపై భిన్న వాదనలు



రిజిస్ట్రేషన్ల.. క్యూ

రాజమహేంద్రవరం సిటీ/సీతానగరం/ కొవ్వూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రిజిస్ట్రేషన్లకు క్యూకట్టారు.. జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలన్నీ శుక్రవారం ఉదయం నుంచి కక్షిదారులతో కిటకిటలాడాయి.భూముల విలువ శనివారం నుంచి పెరుగుతుందనే కారణంతో గత వారం రోజులుగా రిజిస్ట్రేషన్లకు డిమాండ్ పెరిగింది. శుక్రవారంతో గడువు ముగియడంతో జిల్లా వ్యాప్తంగా కార్యాలయాల్లో రాత్రి వరకూ రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఒక్కో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 50 నుంచి 70 వరకూ రిజిస్ట్రేషన్లు జరిగినట్టు సమాచారం.

ఒక్కరోజే 600 రిజిస్ట్రేషన్లు

రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ చార్జీలను పెం చుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.ఫిబ్రవరి 1 అంటే నేటి నుంచి నూతన ఫీజు విధానం అమలు కాబోతుంది. దీంతో ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్లకు ఎదురుచూసిన ప్రజలు గత రెండ్రోజులుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద క్యూకట్టారు.జిల్లా వ్యాప్తంగా 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కక్షిదారులతో కిక్కిరి శాయి.ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద రాత్రి పొద్దుపోయే వరకు బారులు తీరారు.జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఒక్కరోజే సుమారు 600 రిజిస్ట్రేషన్లు జరిగాయి. కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు సరాసరి 20 నుంచి 30 రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. భూములు ధరలు పెరుగుతాయని సమాచారం రావడంతో 20 శాతం స్టాంపు డ్యూటీ పెరుగుతుందని క్రయ విక్రయదారులు రిజిస్ట్రేషన్లకు పోటెత్తారు.శుక్రవారం ఒక్కరోజే 92 దరఖాస్తులు వచ్చాయి. కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి లాంచీలరేవు వరకు రిజిస్ట్రేషన్లకు వచ్చిన వారి కార్లతో రహదారి నిండిపోయింది. రిజిస్ట్రేషన్లకు వచ్చినవారు ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు రోడ్డుపైనే నిల్చుండిపోయారు. సర్వర్ స్లోగా ఉండడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తయ్యేసరికి రాత్రి 11 గంటలు అవుతుందని భావిస్తున్నారు.

పెంచిన ఫీజు ఇలా..

ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా భూమి విలువను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు ఉన్నదానిపై 5 నుంచి 20 శాతం లోపు భూమి విలువ పెంచింది. దీంతో రిజిస్ట్రేషన్ విలువ పెరుగుతుంది. ఇప్పటి వరకు ఉన్న రిజిస్ట్రేషన్ చార్జీలపై 1.5 శాతం అదనంగా పెం చారు.శుక్రవారం అర్ధరాత్రి నుంచి పెంచిన చార్జీలు అమలు చేసే అవకాశం ఉంది. స్థిరాస్తుల విలువలను బట్టి కొనుగోలు దస్తావేజులకు అయితే 7.5 శాతం చొప్పున అంటే లక్షకు రూ.7500లు చొప్పున సెటిల్‌మెంట్ దస్తావేజులకు కుటుంబ సభ్యుల రిలేషన్లను బట్టి 2.5 శాతం నుంచి 3.5 శాతం వరకు అంటే లక్షకు రూ.2500 నుంచి రూ.3500 వరకు ఫీజులు చెల్లించాల్సి వస్తుంది. పెరిగిన రేట్లను బట్టి అద నంగా అయ్యే ఖర్చు తగ్గించుకోవడానికి కొనుగోలుదారులు ముందస్తుగా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటారు.దీంతో గత వారం రోజులుగా రిజి స్ట్రేషన్లు పెరిగాయి. జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు క్రయవిక్రయదారులతో సందడిగా మారాయి. కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ కె.సుందరరావు మాట్లాడుతూ భూముల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో గత వారం రోజులుగా రిజిస్ట్రేషన్లకు కక్షిదారులు పోటెత్తారని తెలిపారు. ప్రభుత్వానికి సుమారు రూ.30 లక్షల నుంచి 35 లక్షల ఆదాయం అధికంగా సమకూరుతుందన్నారు.

- రిజిస్ట్రేషన్ ఆఫీస్‌ల కిటకిట
- రాత్రయినా క్రయవిక్రయాలు
- గురువారం 702..
- శుక్రవారం 600 రిజిస్ట్రేషన్లు
- రెండు రోజుల్లో 1302
- భూముల విలువ పెంపే కారణం

రెండు రోజుల్లో 1302 రిజిస్ట్రేషన్లు

జిల్లాలో 5 నుంచి 20 శాతం వరకు ఆస్తుల విలువలు పెరిగాయి. సబ్ రిజిస్ట్రారు కార్యాలయ ప్రొటెన్షియాలిటీని బట్టి విలువలు పెంచడం జరిగింది.సీతానగరం మండలంలో 20 శాతం వరకు పెరిగింది.జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో గురువారం 702 రిజి స్ట్రేషన్లు,శుక్రవారం 600 రిజిస్ట్రేషన్లు జరిగాయి.

- రెడ్డి సత్యనారాయణ, జిల్లా రిజిస్ట్రారు





మూడో రోజు పార్కులో పరిశీలిస్తున్న ఎస్ఈ పాండురంగారావు, శానిటేషన్ సిబ్బంది, మాజీ కార్పొరేటర్ చండీప్రియ తదితరులు.. కాలనీలో వెలుగుతున్న లైట్లు

చీకటి పోయింది.. వెలుగొచ్చింది!

వెంకటేశ్వరనగర్‌లో మూడో రోజు పనుల జోరు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అక్షరమే అండగా , సమస్యల పరిష్కారమే అజెండా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సమస్యల పరిష్కారంపై వెంకటేశ్వరనగర్‌లో నిర్వహించిన సభలో అధికారుల్లో కదలిక వచ్చింది. ప్రజల నుంచి ప్రధానంగా తలెత్తిన సమస్యలపై అధికార యంత్రాంగం దృష్టిపెట్టింది.ఈ మేరకు గత మూడు రోజులుగా వరుసగా 9వడివిజన్‌లో ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది, మాజీ కార్పొరేటర్ కోసూరి చండీప్రియ, పార్కు కమిటీ పెద్దలు కలిసి వెంకటేశ్వనగర్‌లో సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తున్నారు. కార్పొరేషన్ ఎస్ఈ ఐ.పాండురంగారావు శుక్రవారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి వెంకటేశ్వనగర్ పార్కును పరిశీలించారు. పార్కులో గతంలో చేపట్టిన పనులపై ఎస్ఈ ఆరా తీయగా సుమారు రూ.65 లక్షల పనులు తెరపైకి వచ్చాయి. అంత మొత్తంతో అభివృద్ధి చేసిన వెంకటేశ్వనగర్ పార్కులేదనే వాదన తెరపైకి వచ్చింది.దీనిపై విచారణకు ఆదేశించే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా పిల్లల కోసం పార్కులో ఏర్పాటు చేసి పరికరాలు, జిమ్ పరికరాలు పాడైపోవడం, టైల్స్ పోవడం తదితర సమస్యలు ఉన్నాయి. పనులకు మరమ్మతులు కాంట్రాక్టరే చేయాల్సి ఉంటుందని పిలిపించి మాట్లాడాలని ఆదేశించారు. పార్కులో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఏది ఏమైనా 9వ డివిజన్‌లో సమస్యలు పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయి.వీధి దీపాలు వేయించారు.



ఆక్రమించేయ్!

గ్రామ చెరువులు అన్యాక్రాంతం

ప్రస్తుతం చెరువులు చూస్తుంటే గుండె చెరువైపోతోంది.. ఎందుకంటే ఆక్రమణలు లేని ఒక చెరువైనా ఉందా అంటే అనుమానమే.. గత వైసీపీ ప్రభుత్వం భూస్వాముల భూములు ఎలా ఉన్నాయో సర్వే చేసింది కానీ.. చెరువులు పరిస్థితి ఎలా ఉందో సర్వే చేయలేదు.. చేసుంటే తెలిసేది ఆక్రమణలన్నీ అక్కడే ఉన్నాయని.. గత ప్రభుత్వంలోనే చాలా మందికి ఇళ్ల స్థలాలు కూడా ఇచ్చేశారు.. అయినా నేటికీ చెరువులన్నీ ఆక్రమణల మధ్యనే ఉన్నాయి. రాజానగరం నియోజకవర్గంలోనే పదుల సంఖ్యలో చెరువులు ఉన్నాయి.ఈ చెరువులదీ ఇదే పరిస్థితి.. ఇకనైనా అధికారులు ఆక్రమణలో ఉన్న చెరువులపై దృష్టి సారించాల్సి ఉంది.

రాజానగరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : దాతల ఆశయం నీరుగారిపోతోంది.. కళ్లెదుటే చెరువులు మాయమైపోతున్నాయి.. నిన్నటి వరకూ ఇక్కడ చెరువు ఉండాలే అనేలా ఆక్రమించేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా తాగు, సాగునీటి చెరువులు అన్యాక్రాంతమైపోతున్నాయి. ఒక పక్క అభివృద్ధి ముసుగులో అక్రమ మట్టి తవ్వకాలు, మరోపక్క అక్రమ కట్టడాలతో చెరువులు కుచించుకుపోతున్నాయి. అయినా చెరువులను కబ్జా కోరల నుంచి రక్షించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువుల్లో చేప పిల్లల విడుదలకు సన్నాహాలు చే స్తుంది.. ఈ నేపథ్యంలో చెరువుల విస్తీర్ణంపై సర్వే చేయించి ఆక్రమణల భరతం పట్టాల్సి ఉంది.

చెరువుల ఆక్రమణ..

రాజానగరం మండలం నందరాడ పరి ధిలో అడుసుమిల్లి వెంకయ్యచెరువు (ఏవీ ట్యాంకు) 566 ఎకరాల విస్తీర్ణంలో ఉంది.దీనిలో నరేంద్రపురం పంచాయతీ పరిధిలో సర్వే నెంబరు 110లో 188.74 ఎకరాలు, నందరాడ పరి ధిలో సర్వే నంబరు 376లో 377.31 ఎకరాల్లో ఉన్న ఏవీ ట్యాంకు నేడు స్వరూపం కోల్పోయి బక్కచిక్కిపోయింది. చెరువు గర్భంలో విలువైన భూమిని కొంతమంది సాగు చేసుకుంటుండగా..మరికొందరు విలువైన మట్టిని రాత్రీపగలు తేడా లేకుండా దోచుకుంటున్నారు. దివాన్‌చెరువులోని తాగునీటి చెరువుగా ఉన్న ఊర చెరువును ఉపాధి హామీ పథకంలో లక్ష లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేసినా ఫలితం లేకపోయింది. సర్వే నెంబరు 1.194లో 5.86 ఎకరాలు,195లో 2.00 ఎకరాలు విస్తీర్ణంలో ఊరచెరువు ఉంది. సర్వే నెంబరు 244లో 10 ఎకరాలు కొత్తచెరువు, సర్వే నెంబరు 283లో 9.52 ఎకరాలు కంచిమూర్తులా చెరువు, సర్వే నెంబరు 315లో 15.22 ఎకరాలు కోలమూరు చెరువు, సర్వే నెంబరు 52లో 8.18 ఎకరాలు పెద్ద చెరువు, సర్వే నెంబరు 53లో 20.24 ఎకరాలు, సర్వే నెంబరు 73లో 3.21 ఎకరాలు యండ్రావారి చెరువులు రికార్డుల్లో నేటికి కూడా నమోదై ఉన్నప్పటికి సహజ సిద్ధం ఆక్రమణల చెరలో కొట్టుమిట్టాడుతున్నాయి. రాజానగరం మండలం ముక్కినాడ పంచాయతీ పరిధిలో ఆక్ర మణకు గురైన చెరువులను పరిరక్షించాలని కోరుతూ జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీరామ్ ఇటీవల రెవెన్యూ సదస్సుల్లో రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఇటీవల రాజా నగరం లో కలెక్టర్ పి.ప్రశాంతి నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో నందరాడ చెరువును ఆక్రమణల నుంచి కాపాడాలని రైతాంగం విన్నవించుకున్నారు.

- మాయమైపోతున్న చెరువులు
- పెరిగిపోతున్న ఆక్రమణలు
- చెరువులపై కానరాని సర్వే
- నీరుగారుతోన్న దాతల ఆశయం
- అయినా పట్టని అధికారులు
- రాజానగరంలో ఇదీ పరిస్థితి
- జిల్లా వ్యాప్తంగానూ ఇంతే
- కలెక్టర్‌కు వినతులు

నియోజకవర్గమంతా ఇంతే..

నియోజకవర్గంలో రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల్లో వందలాది ఎకరాల విస్తీర్ణంలో తాగుసాగునీటి చెరువులు ఉన్నాయి. చెరువుల అభివృద్ధి ముసుగులో గత వైసీపీ ప్రభుత్వంలో విలువైన మట్టిని జగనన్న కాలనీలు చదును పేరుతో వైసీపీ నాయకులు అక్రమంగా తవ్వి జేబులు నింపుకున్నారు. కొన్ని చెరువులను ఆక్రమించేశారు.తాగునీటి అవస రాలకు వినియోగించే చెరువు గట్టుపై ఇప్పటికే ఎవరికి వారు ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేసి పక్కా భవన నిర్మాణాలు చేపట్టారు.చెరువుల ఆక్ర మణలకు సంబంధించి సదరు గ్రామస్తులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించు కోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో పంచాయతీ అధికారులు రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఆక్రమిత స్థలాల్లో నిర్మాణాలు పుట్టు కొస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు సాగు, తాగునీటి చెరువులపై దృష్టి సారించి,చెరువు భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ముంచేస్తుందమ్మా.. కలెక్టరమ్మా

అడుసుమిల్లి వెంకయ్యచెరువు (ఏవీ ట్యాంకు) ఆయకట్టు పరిధిలో నందరాడ, కలవచర్ల గ్రామాలకు సంబంధించి సుమారు 1200 ఎకరాలు సాగులో ఉంటుంది. అధిక వర్షాలు,వరదల సమయంలో ఏవీ ట్యాంకులో అవసరమైనప్పుడు వాడుకునేందుకు నీటి నిల్వకు చెరువు కళింగలకు బల్లలతో అడ్డుకట్ట వేయడం పరిపాటి. దీంతో ఎగువ భాగం నరేంద్రపురం పరిధిలోని రైతుల వరి పొలాలు ముంపునకు గురవుతుంటాయి. ఈ విధంగా ప్రతిసారి దాదాపు 100 నుంచి 130 ఎకరాల్లోని వరి పంట ముంపుబారిన పడుతోంది. తమ పంట పొలాలను ముంపు బారి నుంచి కాపాడాలని అనేకమార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోవడంతో ఇటీవల రాజానగరంలో కలెక్టర్ పి.ప్రశాంతి నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో నరేంద్రపురం రైతాంగం విన్నవించుకున్నారు. తమ రెవెన్యూ పరిధిలో ఏవీ ట్యాంకులో 188 ఎకరాలు ఉన్నప్పటికి ఆదాయం మాత్రం ఫిషర్‌మెన్ సొసైటీ పేరుతో నందరాడకు కట్టబెడుతున్నారని కలెక్టర్‌కు వివరించారు.దీని వల్ల తమ గ్రామానికి ఆదాయం రాకపోగా.. పంట పొలాలు ముంపునకు గురై అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వాపోయారు. ఇప్పటి కైనా అధికారులు దృష్టి సారించి అధిక వర్షాల సమయంలో చెరువు కళింగలకు అడ్డుకట్ట వేయకుండా.. చేపల ద్వారా వచ్చే ఆదాయం తమ పంచాయతీకి వర్తించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రశాంతికి విజ్ఞప్తి చేశారు.



ర్యాంపు వద్ద మాట్లాడుతున్న జేసీ

ఆరు వేబ్రిడ్జిల నిర్మాణం : జేసీ

కొవ్వూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు డివిజన్ పరిధిలో ఇసుక రీచ్‌ల వద్ద ఏర్పాటు చేయనున్న ఆరు వేబ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జేసీ చిన్నరాముడు ఆదేశించారు.ఇసుక ర్యాంపులను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. ఇసుక ర్యాంపుల నుంచి పరిమితికి లోబడి లోడింగ్ చేయాలన్నారు. ఇసుక ర్యాంపులలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది జవాబుదారీతనంగా ఉండాలన్నారు. ఆర్డీవో డా.రాణి సుస్మిత మాట్లాడుతూ కొవ్వూరు పట్టణంలో ఎరినమ్మ, ఔరంగాబాద్ 1,2, వాడపల్లి, దండకుంట ఇసుకరీచ్‌ల వద్ద వే బ్రిడ్జి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. త్వరితగతిన వేబ్రిడ్జిల నిర్మాణ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ ఉన్నారు.

కడియపులంక ఎన్నికలకు హైకోర్టు ఉత్తర్వులు

కడియం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కడియం మండలం కడియపులంక పంచాయతీకి ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఈనెల 24న ఉత్తర్వులు విడుదల చేసినట్టు సమాచారం.2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కడియపులంక సర్పంచ్ స్థానం బీసీ-మహిళకు కేటాయించారు.ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన మార్గాని అమ్మాణీ సర్పంచ్‌గా విజయం సాధించారు.అయితే పదవిలో ఉండగానే అమ్మాణీ 2023 మే 21న చనిపోయారు. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారులు ఉపసర్పంచ్‌గా ఉన్న పాటంశెట్టి వెంకటరామారావుకు ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై సంతృప్తి చెందని దివంగత సర్పంచ్ అమ్మాణీ భర్త ఏడుకొండలు, పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.దీంతో నాలుగు నెలల్లోపు ఎన్నికలు జరపాలంటూ హైకోర్టు ఉత్తర్వులు విడుదల చేసినట్టు తెలిసింది.

ఆహారంలో నాణ్యత లోపిస్తే సహించం

డొక్కా సీత మ్మ మధ్యాహ్న భోజన పథకం అడిషనల్ డైరెక్టర్ వెంకట్రాజు


గోపాలపురం హైస్కూల్లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న వెంకట్రాజు

గోపాలపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ఆహారంలో నాణ్యత లోపిస్తే సహించబోమని ఆ పథకం అడిషనల్ డైరెక్టర్ వెంకట్రాజు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వంటలు చేయాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎంఈవో శ్రీనివాసరావు, హెచ్ఎం సోమరాజు, ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ నిర్వాహకులు ఉన్నారు.

ఉద్యాన పంటల సాగుపై మక్కువ చూపాలి


రైతు సదస్సును ప్రారంభిస్తున్న కేవీకే సంచాలకుడు గోవిందరాజు

నల్లజర్ల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రైతులు ఉద్యాన పంటలను పండించేందుకు మక్కువ చూపించాలని కృషి విజ్ఞాన కేంద్ర సంచాలకుడు బి.గోవిందరాజు అన్నారు. పార్వతీపురం విశ్వవిద్యాలయంలో చదువుతున్న 10 మంది విద్యార్థులు శుక్రవారం తెలికిచర్లలో ఏర్పాటు చేసిన రైతు సదస్సు లో ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటల ద్వారా రైతులకు స్థిర ఆదాయం లభిస్తుందని, కూలీల ఖర్చు తగ్గుతుందని, ప్రతికూల వాతావరణంలో సైతం ఆదాయం వస్తుందన్నారు. ఉద్యాన పంట వల్ల పచ్చదనం పెరిగి వర్షాలతోపాటు ప్రజలకు చల్లదనం కలిగిస్తాయన్నారు. ప్రభుత్వాలు సైతం ఉద్యాన పంటలకు ప్రోత్సహకాలు ఇస్తోందన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారిణి బబిత, టీడీపీ నాయకులు సుంకర సుబ్బారావు, చీమకుర్తి రామకృష్ణ, సర్పంచ్ బండి చిట్టి, డాక్టర్ అరుణకుమారి, పెదబాబు పాల్గొన్నారు.

వీధి బాలలను వసతి గృహాల్లో చేర్పించాలి


సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాదులు

మదర్ థెరిస్సా హోంలో న్యాయ విజ్ఞాన సదస్సు

కొవ్వూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వీధి బాలలను గుర్తించి వసతి గృహాల్లో చేర్పించి వారికి న్యాయమైన ఆహారం, వసతి కల్పించాలని న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు అన్నారు. స్ట్రీట్ చిల్డ్రన్స్ డే సందర్భంగా శుక్రవారం కొవ్వూరు సత్యవతినగర్‌లోని మదర్ థెరిస్సా హోంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ప్యానల్ న్యాయవాదులు మాట్లాడుతూ వీధిబాలలను గుర్తించి వారికి వసతి కల్పించడంతో పాటు నాణ్యమైన ఆహారం అందించాలని, పాఠశాలల్లో చేర్పించి విద్యనందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.శ్రీవల్లీ, వీవీవీ లక్ష్మి, మునీంద్ర, పి.హరీష్, ఎస్.కాంతిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉమాదేవి సేవలు స్ఫూర్తిదాయకం


గోపాలపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో సమాజం మనకి ఏం చేసిందనేది ముఖ్యం కాదని మనం సమాజానికి ఏం చేశామన్నదే ముఖ్యమని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పి క్రమశిక్షణతో పాటు ఉన్నత చదువుల కోసం విద్యార్థులను తీర్చిదిద్దిన ఉమాదేవి సేవలు నేటి ఉపాధ్యాయ లోకానికి స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం ఉమాదేవిని ఎమ్మెల్యే సత్కరించారు. తదుపరి ఎమ్మెల్యేను ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, కొర్లపాటి రాము, జ్యేష్ట శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లి జడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తూ స్వచ్ఛంద పదవీ విర మణ చేసిన అంబటి వర లక్ష్మిని శుక్రవారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను 30 సంవత్సరాల పాటు కొయ్యలగూడెం, నర్సాపురం, వేలివెన్ను, యర్నగూడెం, పాఠశాలల్లో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తించానన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే యర్నగూడెం జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వీలా శేషగిరిరావు పదవీ విరమణ చేయడంతో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.


దేవరపల్లిలో ఉపాధ్యాయురాలు వరలక్ష్మికి సన్మానం

ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి గంగాధర్

కొవ్వూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): దేశంలో జనాభా కంటే ఎలుకలు ఐదురెట్లు ఎక్కువని వ్యవసాయశాఖాధికారి ఎ.గంగాధర్ తెలిపారు. ఎలుకల నిర్మూలనలో భాగంగా శుక్రవారం కొవ్వూరు మండలం ధర్మవరం, దొమ్మేరు గ్రామాల్లో వరి పండించే రైతులకు సామూహిక ఎలుకల నివారణపై అవగాహనా సదస్సులు నిర్వహించారు. గంగాధర్ మాట్లాడుతూ ఎలుకలు తినేదాని కన్నా 7నుంచి 8 రెట్లు పాడుచేస్తాయన్నారు. వాటి నివారణకు 100గ్రాముల విషపు ఎర తయారీకి 2గ్రాముల బ్రోమోడైలోన్ మందును 96గ్రాముల నూకలు, 2గ్రాముల నూనె కలిపి సజీవ బొరియకు 10గ్రాముల చొప్పున పొట్లాలు కట్టి పెట్టాలని రైతులకు సూచించారు. ఈ మందు వాడడం వల్ల ఎలుకలకు దాహం వేసి నీటి కోసం బయటకెళ్లి చనిపోతాయన్నారు.

7న మహా ప్రదర్శనకు తరలిరండి

మాదిగల రక్షణ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్


సమావేశంలో మాట్లాడుతున్న శేఖర్

నల్లజర్ల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో లక్ష డప్పులు-వేల గొంతులు మహా ప్రదర్శన కార్యక్రమం ఈ నెల 7న హైదరాబాద్‌లో జరుగనుందని, నియోజకవర్గం నుంచి మాదిగలు తరలి రావాలని మాదిగల రక్షణ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కండెల్లి శేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సవేరా హోటల్లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘ నేతలతో ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాటం చేసి ఎస్సీ వర్గీకరణ సాధ్యం చేశారని, మహా ప్రదర్శనకు ఆయన విచ్చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమం లో మర్లపడి ఏసుదాసు, బయ్యవరపు రాజేశ్వరావు, మోదుగ సుబ్బారావు, మర్రి కిషోర్, గెరా శ్రీను, చెట్టే శ్రీనివాస్, కలపాల శేషు, యోసేపు పాల్గొన్నారు.

యర్నగూడెం ప్రభుత్వ ఆయుర్వేద

వైద్యాధికారిణిగా విద్యారామన్



దేవరపల్లి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలం యర్నగూడెం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారిణిగా డాక్టర్ విద్యారామన్ శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన స్వగ్రామం మచిలిపట్నం వద్ద కోసూరు అని బీఏఎంఎస్ విద్యను విజయవాడలో పూర్తి చేసి గోల్డ్ మెడల్ సాధించానని తెలిపారు. ఎన్‌టీఆర్ యూనివర్శిటీలో బంగారు పతకాన్ని సాధించానన్నారు. హైదరాబాదులో ఎంఎస్ ఆయుర్వేదం పూర్తిచేసి తొలి పోస్టింగ్ యర్నగూడెంలో చేరానని తెలిపారు. ఆసుపత్రిలో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు వైద్య సేవలందించటం జరుగుతుదన్నారు. ఈఅవకాశాన్ని దేవరపల్లి మండల ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

ప్రజా యుద్ధ నౌక గద్దర్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఒక సంఘర్షణ, అణచివేత, ఆకలి నుంచి పుట్టిన ఉద్యమాలకు నిలువెత్తు నిదర్శనం, ప్రజా యుద్ధనౌక గద్దర్ అని ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘం నేతలు అన్నారు. స్థానిక గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం గుమ్మడి విఠల్‌రావు(గద్దర్) జయంతిని సంఘం, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు.

కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


కొవ్వూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం రాత్రి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయానికి కూటమి నాయకులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే ముప్పిడి కూటమి నాయకులకు అభ్యర్థి రాజశేఖర్‌ను పరిచయం చేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఎంపీపీ కాకర్ల నారాయుడు, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

రాజశేఖర్‌ను గెలిపించుకుందాం

నిడదవోలు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కూటమి నాయకులంతా కలసికట్టుగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. నిడదవోలులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ మాట్లాడుతూ రాజశేఖర్ గెలుపే లక్ష్యంగా తెలుగుదేశం, జనసేన, బీజేపీలు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నిడదవోలు పట్టణ, మండలంతోపాటు ఉండ్రాజవరం, పెరవలి మండలాల కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


నిడదవోలు సమావేశంలో మాట్లాడుతున్న బూరుగుపల్లి

ఎన్నికల నియమావళికి లోబడి

పని చేయాలి : జేసీ


అంగస్‌ఫుడ్ ఫ్యాక్టరీలో నిర్వాహకులతో మాట్లాడుతున్న జేసీ చినరాముడు

గోపాలపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నియమావళికి లోబడి పని చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ చినరాముడు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎ.అజయ్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ఎన్నికల నియమావళిపై అనుసరించాల్సిన విధి విధానాలను వీఆర్వోలకు వివరించారు. అనంతరం గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు పరిశీలించి అంగస్‌ఫుడ్ ప్రైవేటు లిమిటెడ్ విస్తరణకు యాజమాన్యం ఫోరం-బీ దరఖాస్తును పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీవో డాక్టర్ రాణి సుస్మిత, వీఆర్వో మురళీ తదితరులున్నారు.

మేరీ మాత ఆలయంలో పేదలకు

నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న డైరెక్టర్ జాన్‌పీటర్, కాంట్రాక్టర్ నాగేశ్వరరావు

దేవరపల్లి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరీపట్నం నిర్మలగిరి మేరీ మాత ఆలయ ప్రాంగణంలో అన్నదాన కాంట్రాక్టర్ కళ్లే నాగేశ్వరరావు కళ్లే లలిత ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యవసరాలు, స్వీట్లు పండ్లు అందజేశారు. నాగేశ్వరరావు భార్య లలిత జయంతి సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్ పీటర్, ఫాదర్‌లు జాన్, శివదుర్గారావు, శ్యామ్, పండు, భాస్కర్,అనీల్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ తెలుసుకోవాలి


దేవరపల్లి హైస్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సుబ్రహ్మణ్యం

దేవరపల్లి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డుభద్రత మాసోత్సవాల్లో భాగంగా దేవరపల్లిలోని జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచి ట్రాఫిక్ రూల్స్ తెలుసుకుని పాటించాలని, వాటిని చుట్టుపక్కల వారికి కూడా తెలియజేయాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ పొందాలన్నారు. ఒక వ్యక్తి ప్రమాదానికి గురైతే ఆ వ్యక్తి ఒక్కడే కాకుండా ఆ కుటుంబమంతా రోడ్డున పడుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీలక్ష్మి, ఏఎస్ఐ నాగభూషణం, హెడ్‌కానిస్టేబుల్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని ఉండ్రాజరం, తాడిపర్రు గ్రామాల్లో ఎస్ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించేటపుడు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఉల్లంఘిస్తే ప్రమాదాలు జరుగుతాయని చెప్పారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాల ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. తొలుత విద్యార్థులు, వాహనదారులు, పోలీసులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని ఆటోయూనియన్ల నాయకులు, డ్రైవర్లు, పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


ఉండ్రాజవరంలో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసరావు

వాసవీ మాత ఆత్మార్పణ దినం

కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు


కొవ్వూరులో హోమం నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

కొవ్వూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. శుక్రవారం కొవ్వూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మట్టే వీరవెంకట వరప్రసాద్ పర్యవేక్షణలో శ్రీ వాసవి ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి సహస్రనామార్చన జరిపారు. సంఘ కార్యదర్శి కొల్లేపర వెంకటేశ్వరరావు, అంజనీ దంపతులు అమ్మవారికి కుంకుమార్చన, ఆత్మార్పణ హోమం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. మండపంలోని లక్ష్మీదేవికి పట్టణానికి చెందిన కక్కిరాల నాగేశ్వరరావు రూ.50 వేలు విలువైన వెండి కిరీటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంబీఎస్ ప్రసాద్, తుమ్మలపల్లి నాగరమేష్, గ్రంధి ప వీణ్, నాళం శ్రీనివాసరావు, కూరపాటి బుజ్జి, వంకాయల శివ రామకృష్ణ, ఎంవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప సర్పంచ్ అప్పన జగదీష్, శ్యామలాసరస్వతి దంపతులు అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించారు. ఆలయార్చకుడు జంద్యాల అశ్వినీదత్ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఎన్డీయే ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడంతో ఆర్య వైశ్య సంఘ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గోకవరపు సూరిబాబు, కొండూరి ప్రసాదరావు, కంకిపాటి సత్యసాయి, గోకవరపు మాణిక్యం, చెక్కా నాగేశ్వరరావు, కూనల రాజా, సొలస రూపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: మండల వాసవి క్లబ్ సభ్యులు నల్లజర్ల శివాలయంలో వాసవి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో కుంకుమ, శాంతి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బోడా వెంకటేశ్వరావు, ఎస్.రామవేంద్రస్వామి, ఎన్వీ కనకదుర్గ, రీజియన్ ఛైర్మన్ ఎన్ఎన్ఎస్ శ్రీనివాస్, చలంచర్ల సునీల్, కొత్త రాఘవులు పాల్గొన్నారు. అనంతపల్లిలో జరిగిన కార్యక్రమంలో వంకాయల వరకుమార్, చిక్కాల నాగేశ్వరరావు, కాసు భద్రయ్య పాల్గొన్నారు.

చాగల్లు: స్థానిక శ్రీకన్యక పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాల అనంతరం విశేష పూజలు చేశారు. ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు జరిపారు. వాసవీ మాత ఆత్మార్పణ దినం మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక అని ఆలయార్చకులు అన్నారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ, ఆర్యవైశ్య మహిళ సంఘం సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.


తాళ్లపూడిలో వాసవీ మాతకు పూజలు


నల్లజర్లలో వాసవీమాతకు ప్రత్యేక పూజలు


చాగల్లులో పూజలు చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు

సీఎం చంద్రబాబును కలిసిన

మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన సీఎం చంద్రబాబును మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా రాజమండ్రిలో పార్టీ చాలా బలంగా ఉందని సీఎం అభినందించారు.

అసలేం జరిగింది ?

తణుకు రూరల్ ఎస్ఐ మూర్తి మృతిపై భిన్న వాదనలు


ఎస్ఐ మూర్తి(ఫైల్)

తణుకు/కె.గంగవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వీఆర్‌లో వున్న పశ్చిమ గోదావరి జిల్లా తణుకు రూరల్ ఎస్ఐ ఏజీఎస్ మూర్తి(38) మృతిపై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మూర్తి ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు, బ్యాచ్ మేట్స్, కుటుంబ సభ్యులు ఆరోపిస్తుంటే.. కాదు గన్‌మిస్ ఫైర్ అయ్యిందని జిల్లా ఎస్పీ నయీం అస్మి చెబుతున్నారు. కుటుంబ సభ్యులు, సహోద్యోగుల కథనం ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరానికి చెందిన ఆదుర్తి గోపాలరావు, సూర్యావతిలకు ఇద్దరు కుమారులు వెంకటేశ్, మూర్తి, కుమార్తె శ్రీలక్ష్మి. మూర్తి టెన్త్ వరకు స్వగ్రామంలోనే చదివాడు. ఎంతో కష్టపడి 2012లో ఎస్ఐ ఉద్యోగం సాధించాడు. విజయలక్ష్మితో వివాహం కావడంతో వీరికి కుమారుడు చందన్(5) కుమార్తె హేమాన్షి (16 నెలలు) ఉన్నారు. పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని మచిలీపట్నం, కైకలూరు, భీమవరం టూ టౌన్, పాలకోడేరు, పెరవలి, నరసాపురం రూరల్, ఆచంట, తణుకు రూరల్ స్టేషన్‌లలో పనిచేశాడు. వేల్పూరులో రెండు గేదెల అపహరణ కేసులో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో నాలుగు నెలలు క్రితం పోలీసు ఉన్నతా ధికారులు వీఆర్‌లో పెట్టారు. అప్పటి నుంచి తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. తనకు సంబంధం లేని కేసులో వీఆర్‌కు పంపారని అవమానంగా భావించాడు. పెనుగొండలో సీఎం పర్యటనకు బందోబస్తుగా వెళ్లాలని ఆదేశాలు రావ డంతో.. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు తణుకు రూరల్ పోలీసుస్టేషన్‌కు బైక్‌పై వచ్చాడు. కొంతసేపటికి సర్వీసు రివాల్వర్ తీసుకుని పక్కనే ఉన్న వాష్ రూమ్‌కు వెళ్లి కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ విషయం తెలియగానే ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన 2012 బ్యాచ్ ఎస్ఐలు పెద్ద ఎత్తున తణుకు ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. అందరికి ధైర్యం చెప్పే మూర్తి ఇలా ఎందుకు చేశాడోనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన పోలీసు శాఖలో కలకలం రేగింది. ఉన్నతాధికారుల నుంచి రకరకాల ఒత్తిళ్లు సిబ్బందిని కుంగిపో యేలా చేస్తున్నాయనే విమర్శలు వచ్చాయి.

కాల్ లిస్ట్ బయటపెట్టాలి

- సోదరుడు, సోదరి డిమాండ్

'చిన్నప్పటి నుంచి అనుకున్నది సాధించాలనే పట్టుదల ఉన్న వ్యక్తిత్వం తనది. ఇప్పటివరకు జిల్లా కేంద్రంలో వున్న మూర్తిని, ఏలూరు రేంజిలో రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు చెప్పారు. దీంతో ఎక్కడ తనకు దూరంగా పోస్టు వస్తుందోనని భావించాడు. జరిగిన దానిని వదిలేయ్ మళ్లీ ఉద్యోగం వస్తుంది. ధైర్యంగా ఉండు. లేదంటే ఉద్యోగం వదిలేసి వచ్చేయమని చెప్పాం. ఉదయం స్టేషన్‌కు వెళ్లిన కొద్దిసేపటికే రివాల్వర్‌తో కాల్చుకుని చనిపోయాడు. పోలీసులు, మీడియా తీరు వల్లే ఇలా జరిగింది. సంబంధం లేని విషయాన్ని పెద్దభూతంలా చేశారు. ఇప్పుడు మనిషే పోయాడ'ని సోదరుడు వెంకటేశ్, సోదరి శ్రీలక్ష్మి కన్నీరు మున్నీరుగా విలపించారు. 'మూర్తి ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదు. అతని ఫోన్‌కాల్ లిస్టు బయటపెట్టాలి. అతని మృతిపై అనుమానాలు ఉన్నాయి. అధికారుల వేధింపులు ఉన్నాయా ? అనే విషయం తేలాలి. సెల్‌ఫోన్, వీడియోలు బయటపెట్టాలి' అని ఆయన స్నేహితుడు కె.గంగవరానికి చెందిన వెంకటరమణ డిమాండ్ చేశారు.

రివాల్వర్ మిస్ ఫైర్ : ఎస్పీ నయీం

'ఎస్ఐ మూర్తి ఉదయం స్టేషన్‌కు వచ్చారు. అందరితోనూ మాట్లాడి వాష్ రూమ్‌కు వెళ్లారు. అక్కడ రివాల్వర్ మిస్ ఫైర్ అయ్యింది. దీనిని గమనించి సిబ్బంది 108లో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మూర్తి చనిపోయారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి వాస్తవాలు వెలుగులోకి తెస్తాం' అని జిల్లా ఎస్పీ నయీం అస్మి తెలిపారు. ఆయన వెంట ఏఎస్పీ భీమారావు తదితరులున్నారు. ఎస్ఐ కుటుంబానికి న్యాయం చేస్తామని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. ఆసుపత్రిలో మూర్తి మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కోటిపల్లిలో శనివారం పోలీసు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలకు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు పామర్రు ఎస్ఐ ఎస్కే జానీ బాషా చెప్పారు.